## విద్వేషాలు రెచ్చగొట్టే వాళ్లకు గుణపాఠం తప్పదు

న్యూఢిల్లీ,దేశంలో జనం మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే వాళ్లకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని రాష్ట్రీయ జనతాదళ్ పార్టీ అగ్ర నాయకుడు, బీహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ అన్నారు. విద్వేష రాజకీయాలు ఎంతో కాలం మనలేవని, జనం మధ్య విద్వేషాలను ప్రేరేపించే వారికి జనం ఫుల్ స్టాప్ పెడుతారని ఆయన వ్యాఖ్యానించారు. బీహార్‌లో నాలుగు స్థానాలకు జరుగుతున్న ఉప ఎన్నికలు, జార?ండ్ అసెంబ్లీ ఎన్నికల గురించి మీడియా అడిగిన ప్రశ్నలకు తేజస్వి యాదవ్ ఈ విధంగా స్పందించారు. బీహార్‌లో ఉప ఎన్నికలు జరుగుతున్న నాలుగు స్థానాలను తామే గెలుస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. జార?ండ్ అసెంబ్లీ ఎన్నికల్లో కూడా తమ కూటమే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. కాగా, జార్ఖండ్ అసెంబ్లీకి ఈ నెల 13, 20 తేదీల్లో రెండు విడతల్లో ఎన్నికలు జరగనున్నాయి. జార?ండ్ అసెంబ్లీ ఎన్నికలతోపాటే బీహార్ సహా పలు రాష్ట్రాల్లో ఖాళీ అయిన అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్నాయి.


# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :223 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శనివారం 09-11-2024 | పేజీలు:4 వెల: 2.00


## యాదాద్రీశ్వరుడి సన్నిధిలో రేవంత్... పుట్టిన రోజు సందర్భంగా ప్రత్యేక పూజలు





యాదాద్రి : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం యాదాద్రి ఆలయానికి వచ్చారు. అనంతరం ఆయన స్వామి వార్ని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.. అంతకు ముందు మంత్రులతో కలిసి ఆలయంలో ప్రవేశించిన ముఖ్యమంత్రికి ఆలయ ప్రధానార్చకులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ క్రమంలోనే రేవంత్ రెడ్డి చిత్రం ముద్రించిన శాలువాతో సీఎంను సత్కరించారు.

ఆలయాభివృద్ధిపై అధికారులతో చర్చలు

ఆలయంలో మౌలిక వసతులు, అభివృద్ధిపై అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్చించారు. భక్తులకు ఎలంటి ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలని సూచించారు. ఇక్కడకు వచ్చిన భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు.

యాదగిరి గుట్ట టెంపుల్ డెవలప్మెంట్ అథారిటీపై సమీక్ష.

యాదగిరి గుట్ట టెంపుల్ డెవలప్మెంట్ అథారిటీ అధికారులతో అలయ అభివృద్ధిపై రేవంత్ సమీక్ష నిర్వహించారు.. ఈ సమీక్షలో న మంత్రులు కొండా సురేఖ, ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, శ్రీనివాసరాజు, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్ రావు, జిల్లా కలెక్టర్ హనుమంతరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు..

మంత్రులు స్వాగతం

నల్గొండ పర్యటనలో భాగంగా హైదరాబాద్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో యాదగిరిగుట్టకు చేరుకున్న ముఖ్యమంత్రికి, యాదగిరిగుట్ట హెలిప్యాడ్ వద్ద మంత్రులు తుమ్మల, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో పాటు స్థానిక నేతలు సాదర స్వాగతం పలికారు. హెలిప్యాడ్ నుంచి ప్రెసిడెన్షియల్ సూట్‌రూమ్‌కి సీఎం చేరుకున్నారు. అనంతరం విష్ణు పుష్కరిణి చేరుకుని అంజలి ఘటించారు. అక్కడ నుంచి సంప్రదాయ దుస్తుల్లో ఆలయానికి చేరుకున్నారు. ముందుగా అఖండ దీపారాధనను దర్శించుకుని దీపం వెలిగించి పూజలు చేశారు. ఆయన వెంట మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, తుమ్మల, పొన్నం, కొండా సురేఖ ఉన్నారు.

## భూకబ్జాలపై ఆరోపణలు వస్తే సహించేది లేదు

హైదరాబాద్,గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో తనపై ఆరోపణలను ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఖండించారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కబ్జాలు జరిగాయ.. గాని తమ ప్రభుత్వంలో కబ్జాలకు తావు లేదన్నారు. గత కొన్ని రోజులుగా ఎమ్మెల్యే అనుచరులు కబ్జాలకు, బెదిరింపులకు పాల్పడుతున్నారని ప్రచారం జరుగుతుందని ఇలాంటి ప్రచారా లను ప్రజలు నమ్మొద్దని తెలిపారు.అధికార పార్టీకి చెందిన ఎవరైనా కబ్జాలకు, బెదిరింపులకు పాల్పడితే సహించేది లేదని, తన దృష్టికి తీసుకువస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు.తన కుటుంబం 70 సంవత్సరాల నుండి ప్రజలకు ఇబ్బందులు పెట్టలేదని,ప్రజలు ఇచ్చిన తీర్పుకు కట్టుబడి ఉంటామన్నారు.తాను తన కుటుంబం రాముల వారి గుడి వద్ద ప్రజల ముందే మాట ఇచ్చామని తెలిపారు. బెల్లంపల్లి నియోజకవర్గంలో అవినీతి, అక్రమాలకు తావుండదన్నారు. తాను నియోజకవర్గంలో సంవత్సర కాలంలో చేసిన అభివృద్ధిపై డిసెంబర్ 7న కరపత్రం విడుదల చేస్తానన్నారు. అధికార పార్టీ నాయకులు,అధికారులు ఎవరైనా అవినీతికి పాల్పడినట్లు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, మచ్చలేని నాయకుడుగా పనిచేస్తానన్నారు.

కబ్జాలపై ప్రత్యేక దృష్టి సారించాం.. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

బెల్లంపల్లి పట్టణంలో కబ్జాలపై ప్రత్యేక దృష్టి సారించామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బెల్లంపల్లిలో కొన్ని ప్రచారాలు కూడా చేస్తున్నారని, ఎవరైనా కబ్జాకు పాల్పడినట్లు తెలిస్తే వెంటనే నాకు తెలియజేయాలని



పేర్కొన్నారు. గతంలో కొందరు తమకు తెలిపిన ఫిర్యాదులపై స్పందించడం జరిగిందని, ఎంతటి వారైనా ఆక్రమాలకు పాల్పడితే సహించేది లేదని తెలిపారు.

కబ్జాలపై ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేసాం%ొ% ఆర్డీవో హరికృష్ణ

బెల్లంపల్లిలో జరుగుతున్న అక్రమాలపై ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించి కూల్చివేతలు చేయడం జరిగిందని, మండలంలోని 3 పైకి స్థలంలో ప్రభుత్వ బోర్డు ఏర్పాటు చేయడం జరిగిందని, కన్నాల గ్రామ పంచాయతీలో, కన్నాల బస్తీలోని అక్రమాలను తీసివేయడం జరిగిందని, కబ్జాల కోసం ప్రత్యేక టీమును ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ జక్కుల శ్వేత శ్రీధర్, మాజీ మున్సిపల్ చైర్మన్ మత్తమరి సూరిబాబు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ముచ్చర్ల మల్లయ్య, నాయకులు మునిమంద రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర సర్వేతో సామాజిక వివక్ష రూపుమాపు

హైదరాబాద్, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆదేశాలతో సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే సామాజిక వివక్షను రూపుమాపేందుకు దోహదపడుతుందని మాజీ ఎంపీ వి.హనుమంతరావు అన్నారు. సమ గ్ర కుటుంబ ఇంటింటి సర్వే ప్రారంభమైన నేపథ్యంలో బాగ్అంబర్‌పేటలో కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. హనుమంత రావుతో పాటు అంబర్‌పేట కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ సి. రోహిణ్‌రెడ్డి హాజరై క్షీరాభిషేకం చేశారు. అలాగే, అంబర్‌పేట డీఎంసీ మారుతి దివాకర్ ఆధ్వర్యంలో జరిగిన సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమంలో పాల్గొని ఇళ్లకు స్టిక్కర్లు అతికించారు. అనంతరం వి.హనుమంత రావు మాట్లాడుతూ, జనాభాకు అనుగుణంగా రాజ్యాంగ ఫలాలు అన్ని కులాలకు అందాలంటే సమగ్ర కులగణన జరగాల్సిందేనని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం భావించిందన్నారు. ఇందులో భాగంగానే తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి చేత ప్రయోగాత్మకంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. తర్వాత దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రల్లో ఈ సర్వేను నిర్వహించేలా కాంగ్రెస్ పార్టీ చర్యలు తీసుకుంటుందన్నారు. రోహిణ్ రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో జరిగే సర్వేలో ప్రజలందరూ పాల్గొనే విధంగా కాంగ్రెస్ పార్టీ నా యకులు కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు శంబుల ఉషశ్రీ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి శంబుల శ్రీకాంత్‌గౌడ్, ఖైర తాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్, మాజీ కార్పొరేటర్లు రాంబాబు, పుల్లా నారాయణ స్వామి, పులిజగన్,



గరిగంటి శ్రీదేవి రమేష్ తదితరులు పాల్గొన్నారు.'దమ్ముందా ఆ ఆంధ్రా కాంట్రాక్టర్‌ను ఆయన ఈస్టిండియా కంపెనీని కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ నుంచి తీసివేయడానికి..? దమ్ముందా లేదా..?' అంటూ ప్రశ్నలు సంధించారు. 'సీఎం అయ్యి ఉండి మేఘూకు గులాంగిరీ చేస్తున్నావా..?' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మేఘూ ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ లోపాల గురించి ప్రశ్నించే శక్తి రావడానికి మీకింకా ఎంత సమయం పడుతుంది..?' అని కేటీఆర్ ఆంగ్లంలో ప్రశ్న వేశారు. 'తెలంగాణకు తొలి ప్రాధాన్యం అనే ఆలోచన రావడానికి మీకు ఇంకా ఎన్ని రోజులు కావాలి..?' అని నిలదీశారు. ఈ పోస్టుతోపాటు 'సుంకిశాల ఘటనలో కాంట్రాక్టర్‌పై చర్యలేవీ' అనే శీర్షికతో ప్రచురితమైన పత్రికా క్లిప్పింగ్‌ను కేటీఆర్ జత చేశారు.

## అలీఘడ్ ముస్లిం యూనివర్సిటీకి మైనార్టీ హెూదా కల్పించే కేసులో సుప్రీం నాలుగు తీర్పులు



న్యూఢిల్లీ, నవంబర్ 8: అలీఘడ్ ముస్లిం యూనివర్సిటీకి మైనార్టీ హెూదా కల్పించే కేసులో .. ఇవాళ సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం నాలుగు రకాల తీర్పులను వెలువరించింది. చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ నాయకత్వంలోని ఏడుగురు ధర్మాసనం ఈ తీర్పుల గురించి తెలిపింది. ఏఎంయూ కేసులో నాలుగు రకాల అభిప్రాయాలు ఏర్పడ్డాయని, దీంట్లో మూడు రకాల వ్యతిరేక తీర్పులు ఉన్నట్లు సీజే చంద్రచూడ్ తెలిపారు. మెజారిటీ తీర్పు తనతో పాటు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జేబీ పర్దీవాలా, మనోజ్ మిశ్రా రాసినట్లు సీజే వెల్లడించారు. జస్టిస్ సూర్యకాంత్, దీపాంకర్ దత్త, సతీశ్ చంద్ర శర్మలు సపరేట్ తీర్పులను ఇచ్చినట్లు జస్టిస్ చంద్రచూడ్ చెప్పారు. విద్యా సంస్థ నియంత్రణ, పరిపాలన విషయంలో పార్లమెంట్‌లో చట్టం చేసినా.. ఆ విద్యాసంస్థకు ఉన్న మైనార్టీ హెూదాను రద్దు చేయరని సుప్రీంకోర్టు ధర్మాసనం తెలిపింది. పార్లమెంట్ చట్టంతో అలీఘడ్ ముస్లిం వర్సిటీ మైనార్టీ హెూదా రద్దు అయినట్లు 1968లో ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు ధర్మాసనం కొట్టిపారేస్తున్నట్లు సీజే చంద్రచూడ్ తెలిపారు. అడ్మినిస్ట్రేషన్‌లో మైనార్టీ సభ్యులు లేనంత మాత్రాన.. ఆ వర్సిటీ మైనార్టీ హెూదా పోదు అని సుప్రీంకోర్టు చెప్పింది.

## ములాకత్ రాజకీయాలతో రేవంత్ బిజీ

హైదరాబాద్, నవంబర్ 8 ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్, రేవంత్ కాంప్రమైజ్ అయ్యారని.. అందుకే మొన్నటి జన్వాడా కేసును గాలికి వదిలేశారంటూ విమర్శలు గుప్పించారు. శుక్రవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో బండి సంజయ్ మాట్లాడుతూ.. రేవంత్‌తో కేటీఆర్ ములాకత్ రాజకీయాలు నడిపిస్తున్నారని.. తెలంగాణలో యాక్టివ్ సీఎం కేటీఆర్ అంటూ సెన్సేషనల్ కామెంట్స్ చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒక్కటై బీజేపీని మీడియాలో లేకుండా చూస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీలో ఆ పార్టీ గురించి ఆలోచించే వారెవరూ లేరన్నారు. కాంగ్రెస్‌ను గద్దె దింపే దమ్ము బీఆర్ఎస్‌కు లేదని అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉంటారో పోతారో అనే భయం కేటీఆర్‌కు ఉందన్నారు. ప్రజా సమస్యల మీద కేసీఆర్ స్పందించడం లేదని.. కేటీఆర్ బామ్మర్ది అరెస్ట్ అయితే అధికారులకు ఫోన్ చేస్తారా అంటూ మండిపడ్డారు. కేటీఆర్ బామ్మర్ది మీద కేసు అయితే ఎమ్మెల్యేలు అంతా వెళ్తారని.. కానీ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలపై కేసు నమోదు అయితే మాత్రం వారిని పరామర్శించరన్నారు. అభ్యర్థి లేడు కాబట్టే ఎమ్మెల్సీ ఎన్నికలకు బీఆర్ఎస్ దూరంగా ఉంటుందంటూ వ్యాఖ్యలు చేశారు. సర్పంచ్‌లు, ఆటో వాళ్ల పొట్ట కొట్టింది బీఆర్ఎస్సే అని.. మళ్ళీ వీరే వారి పట్ల సానుభూతి చెప్పేందుకు వెళ్తే వారు నమ్ముతారా అని నిలదీశారు. అందుకే కేటీఆర్‌ను అడ్డుకుంటున్నారన్నారు. ఆందోళనకారులు కూడా ఆలోచించాలన్నారు. బీఆర్ఎస్ వాళ్ళను ఉద్యమాలకు పిలిస్తే మీరే నష్టపోతారన్నారు. బీఆర్ఎస్‌లో హరీష్ రావు ఎంతో కొంత క్రిడిబులిటీ కలిగిన నాయకులని.. అయితే కేటీఆర్ అహంకారి అంటూ వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్



తమాషాలు మానేయాలని హితవుపలికారు. ప్రధాని గురించి కూడా ఏకవచనంతో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అక్రమంగా సంపాదించిన డబ్బు వల్లే అహంకారం పెరిగిందని.. ఆయన కళ్ళు నెత్తికెక్కాయంటూ విరుచుకుపడ్డారు. బండి సంజయ్, రేవంత్ ఒక్కటేనని సోషల్ మీడియా ద్వారా కేటీఆర్ నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. " కేటీఆర్ గత చరిత్ర ఏంటి.. గతంలో నీవు మీ నాన్న చేసిన వ్యాపారం ఏంటి. ఇన్ని ఆస్తులు ఎలా వచ్చాయి. కేటీఆర్‌కు రాజ్‌భవన్ అంటే గౌరవం లేదు. కేటీఆర్ ఆయనకి ఆయనే మలేసియా పారిపోయాడు అని ప్రచారం చేసుకున్నాడు. నీవు మలేషియా పారిపోయావ్ అనేది ఎంత నిజమో... రాజ్‌భవన్ వేదికగా నీ మీద కుట్ర జరిగింది అనేది అంతే నిజం అయ్యి ఉండొచ్చు. బీజేపీలోకి హరీష్ రావు వస్తానంటే తీసుకోవడం ... నా ఒక్కడి నిర్ణయం కాదు. మాది ఏక్ నిరంజన్ పార్టీ కాదు ... పార్టీలో అంతా కలిసి నిర్ణయం తీసుకోవాలి" అంటూ బండి సంజయ్ పేర్కొన్నారు.

## నీ మూసీ దాహానికి అత్తాపూర్ ఆగం..ఆగం



అమరావతి, నవంబర్ 8 : హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూసీ యాత్రపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. మోకాలికి దెబ్బ తగిలితే బోడి గుండుకు కుట్లు వేసినట్టు గుంపు మేస్త్రీ పాలన తీరు ఉందని విమర్శించారు. హైదరాబాద్‌లో మూసీ బాధితులు ఉంటే.. నల్లగొండలో మూసీ పరివాహక ప్రాంత రైతులను కలవడంలో రేవంత్ రెడ్డి ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. కూల్చిన ఇండ్లెక్కడ, కాలిన కడుపులెక్కడ, నువ్ తిరుగుతున్న ప్రాంతం ఎక్కడ అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. నీ మూసీ దాహానికి అత్తాపూర్ ఆగమైందని, గోల్నాక గొల్లుమంటుందని, దిలుషుక్ నగర్ ఢీలా పడిందన్నారు. నీ కుట్రలకు అంబర్ పేట్, అత్తాపూర్ అతలాకుతలం అవుతుంటే.. నీ పుట్టినరోజు వేడుకలు జరుగుతున్నది ఎక్కడని ప్రశ్నించారు. అయ్యా సంబరాల రాం బాబు.. నీ అన్యాయానికి ఆవేధనలు, ఆవేశాలు, ఆక్రందనలు వినిపిస్తున్నవి, కనిపిస్తున్నవి అక్కడ కాదు.. రా ఇటు వైపు రా ఇక్కడ చెయ్యి నీ పాదాల మీద యాత్ర అంటూ ఎక్స్ వేదికగా విమర్శించారు. తేలు మంత్రం రానోడు పాము కాటుకు మంత్రం ఏసినట్లు.. పాలన తెల్వని నీకు పగ్గాలు అప్పగిస్తే ప్రజల బతుకుల్ల మన్ను పోసినవ్ అంటూ మండిపడ్డారు."మోకాలికి దెబ్బ తగిలితే బోడి గుండుకు కుట్లు వేసినట్టు ఉంది గుంపు మేస్త్రీ పాలన తీరు హైదరాబాద్ లో మూసి బాధితులు ఉంటే-నల్గొండలో మూసి పరివాహక ప్రాంత రైతులను కలవడంలో రేవంత్ రెడ్డి ఆంతర్యం ఏమిటి? అని ప్రశ్నించారు.

సీఎం రేవంత్‌కు కేటీఆర్ జన్మదినోత్సవ శుభాకాంక్షలు

సీఎం రేవంత్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. తాను హైదరాబాద్‌లోనే ఉన్నానని, మీ ప్రభుత్వ ఏజెన్సీలు ఎప్పుడైనా రావచ్చంటూ ట్వీట్ చేశారు. విచారణకు వచ్చిన సిబ్బందికి చాయ్, ఉస్మానియా బిస్కెట్లు ఇస్తానని తెలిపారు. వారు కోరితే మీ బర్త్‌డే కేక్ కూడా కట్‌చేయిస్తానని చెప్పారు. కాగా, అరెస్టు భయంతో కేటీఆర్ మలేషియా వెళ్తున్నారంటూ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ న్యూస్‌పేపర్ రాసుకొచ్చిందని బీఆర్ఎస్ నేత మన్నె క్రిషాంక్ చేసిన ట్వీట్‌ను ఆయన కేటీఆర్ ట్యాగ్ చేశారు. కేటీఆర్ ప్రతిష్ఠను మసకబార్చేందుకు ఇదంతా చేస్తున్నారని మాకు తెలుసని, జర్నలిజాన్ని జోక్‌గా మార్చవద్దంటూ క్రిషాంక్ అందులో పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో చాయ్ తాగుతూ ఈ వార్తను చదువుతూ ఉంటారని చెప్పారు.

### కేఏపాల్ పిటిషన్ డిస్మిస్...

అమరావతి, తిరుమలను కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటించాలని కోరుతూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది. కేఏ పాల్ వేసిన పిటిషన్‌పై శుక్రవారం ఉదయం విచారణ చేపట్టిన జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కేవీ విశ్వనాథన్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ మేరకు తీర్పునిచ్చింది. తిరుమలను కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటించాలని కేఏ పాల్ ఇటీవల సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. తిరుమల దేవాలయాల నిర్వహణ పాలకమండలి చేతిలో కాకుండా పూజారుల చేతుల్లో ఉంచాలని ఆ పిటిషన్‌లో కేఏ పాల్ కోరారు.

## బీజేపీ తీరువల్లే మణిపూర్ తగులబడింది



రాంచీ, బీజేపీ (బీజేపీ) సర్కారు తీరుపై లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ (కాంగ్రెస్ ఎంపీ) రాహుల్ గాంధీ (రాహుల్ గాంధీ) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ తీరువల్ల దేశం సర్వనాశనం అయ్యి ఉంది. మణిపూర్ (మణిపూర్) గురించి చెప్పాలంటే మణిపూర్‌ను వాళ్లు (బీజేపీ) పూర్తిగా తగులబెట్టారని. ఇప్పటికీ మణిపూర్ పాలకులు బీజేపీని తగులబెడుతూనే ఉన్నారు.మణిపూర్‌లో రోజుల తరబడి హింస చెలరేగిన కేంద్రం నిమ్మకు నీరెత్తినట్లుగా ఉందని రాహుల్ గాంధీ మంటలు చెలరేగింది. కనీసం దేశ ప్రధాన మంత్రి కూడా మణిపూర్‌ను సందర్శించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని రాష్ట్రాలు తిరుగుతున్న ప్రధాని మణిపూర్‌కు వెళ్లడం లేదంటే.. మణిపూర్ అంత దుస్థితిలో మరో రాష్ట్రం లేదని బీజేపీ ఒప్పుకున్నట్లేనని రాహుల్ అన్నారు.బీజేపీ వ్యవహారశైలివల్లే మణిపూర్ కొన్ని నెలలపాటు నిప్పుల

## సంపాదకీయం

శనివారం 09-11-2024

# భారాల మోత!

ప్రజల నెత్తిన మరో రూ.12 వేల కోట్ల ట్రూ అప్ చార్జీల భారం మోపాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించటం దారుణం. ఇంధన ఛార్జీల సర్దుబాటు పేరుతో ఇప్పటికే రూ.6 వేల కోట్ల భారం వేసిన కూటమి సర్కారు ఆ పిడుగు తలపై ఉండగానే, మరొకసారి అంతకు రెట్టింపు విద్యుత్ భారంతో ఉరుముతోంది. ఈ రెండు భారాలూ ఏకమైతే, విద్యుత్ వినియోగదారులపై అసలు కన్నా అదనపు భారమే ఎక్కువై, నెలవారీ బిల్లులు తడిసి మోపెడవుతాయి. అటు కేంద్ర ప్రభుత్వపు పెట్రో భారాలతో నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతుండగా, దీనికి ఇప్పుడు కరెంటు భారాలు కూడా తోడవుతాయి. ద్రవ్యోల్బణం ధాటికి విలవిల్లాడుతున్న సామాన్యుల బతుకులపై అర్థంపర్థం లేని సర్దుపోటు ఛార్జీలు బనాయించటం మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టే అవుతుంది! తాము అధికారంలోకి వస్తే ఒక్క రూపాయి విద్యుత్ భారం కూడా వేయబోమని ఎన్నికలకు ముందు చంద్రబాబు చెప్పిన మాటలకు భిన్నంగా ఇప్పుడు జరుగుతోంది. విద్యుత్ భారాలను పెంచటం అంటే- ప్రజల దైనందిన జీవన స్థితిగతులను మరింత దుర్భరం చేయటమేనన్న ఇంగితాన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తెరగాలి.గతంలో ఎప్పుడో వాడిన విద్యుత్‌కు సర్దుబాటు ఛార్జీలు అంటూ ఆ తరువాతి కాలంలో అదనపు వసూళ్లకు పాల్పడడం ఒక అడ్డగోలు విధానం. పంపిణీ సంస్థలు పదే పదే ఇదే విధంగా అనంతర భారాలను వినియోగదారుల మీద రుద్దుతున్నాయి. గత నెలలోనే ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి) రూ.6072 కోట్ల సర్దుబాటు మొత్తాన్ని వినియోగదారుల నుంచి వసూలు చేయటానికి పంపిణీ సంస్థలకు అనుమతినిచ్చింది. ఈ భారం డిసెంబరులో వచ్చే నవంబరు నెల కరెంటు బిల్లుల్లో పడనుంది. ఇదిలా ఉండగానే- విద్యుత్ పంపిణీ సంస్థలు 2023 %-% 24 సంవత్సరానికి విద్యుత్, ఇంధన కొనుగోలు ఖర్చులో సర్దుబాటు కోసమని చెబుతూ, రూ.11,826 కోట్ల భారాన్ని ప్రతిపాదించాయి. ఇందులో రూ.3500 కోట్ల మొత్తాన్ని డిస్కంలు ఇప్పటికే వినియోగదారుల నుంచి అదనపు ఛార్జీల పేరిట వసూలు చేశాయి. మిగతా సొమ్మును వసూలు చేయటానికి తాజాగా ఇఆర్‌సి అనుమతిని కోరాయి. ఆమోదం లభిస్తే జనవరిలోనో, ఆ తరువాతనో వచ్చే బిల్లుల్లో ఈ అదనపు భారం పడుతుంది. దీనివల్ల యూనిట్ కనీస ధర వచ్చే కొత్త బిల్లుల్లో రూ.3ల వరకూ మోగుతోంది.డిస్కంలకు పంపిణీ, ఇతర రూపాల్లో ఇంత మేర నష్టాలు ఎందుకు వస్తున్నాయి? ప్రభుత్వ విద్యుత్ ఉత్పాదక సంస్థల నుంచి కాక ప్రయివేటుగా కొనటం వల్లనే ఇంతింత వ్యత్యాసాలు వస్తున్నాయా? వినియోగ కాలానికి, మదింపు సమయానికి మధ్య అంచనాల్లో, ధరల్లో భారీ తేడా ఎందుకు ఉత్పన్నమవుతోంది? ఇత్యాది సందేహాలన్నింటికీ సమాధానాలు రావాల్సి ఉంది. కానీ, డిస్కంలు భారాలను వల్లించి, వడ్డించటం తప్ప కారణాల విశ్లేషణ జోలికి పోవటం లేదు. ప్రజల మీద ఎడాపెడా భారాలు వేస్తున్నప్పుడు దానికి గల నిర్దిష్ట పరిస్థితులేమిటో కూడా చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ప్రయివేటు కంపెనీల లాభాల కోసమే ఇదంతా జరుగుతుందా? అన్నది తేల్చాలి. ప్రభుత్వ సంస్థలను బలోపేతం చేసి, వాటి నుంచి విద్యుత్ కొనుగోలు చేయటం ద్వారా ప్రయివేటు కంపెనీలకు ముకుతా డు వేయాలి. అలాంటి ఆచరణకు ఎప్పుడో తిలోదకాలు ఇచ్చిన పాలకులు మార్కెట్టు ఇష్టారీతికి వినియోగదారులకు బలి చేయటం దారుణం. తప్పుడు విధానాలు, అవినీతి, అధిక భారాలను మోపే ఒప్పందాలూ, ఓపెన్ మార్కెట్లో విద్యుత్ కొనుగోళ్లూ %ా% ప్రజలపై పెను భారాలుగా పరిణమిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో సమీక్షించి, విధానపరమైన లోపాలను చక్కదిద్దాలి. పంపిణీలో జరుగుతున్న అన్ని రకాల లోపాలనూ అదుపుచేయాలి. ఈలోగా డిస్కంలు కోరీకోరగానే అదనపు భారాలను ప్రజల మీదికి బదలాయించకుండా ప్రభుత్వమే భరించాలి. 'తాత కతికిన దానిని మనవడి వద్ద పితికే' మోసకారి ట్రూఅప్ ఛార్జీల విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలి. నెల వ్యవధిలోనే జనం నెత్తి మీద వేయటానికి సిద్ధం చేసిన రూ.18 వేల కోట్ల భారాన్ని ఉపసంహరించుకోవాలి. నిజ వేతనాలు తగ్గిపోయి, నిత్యావసరాల ధరలు పెచ్చు పెరిగిపోయి, నానా ఇబ్బందులూ పడుతున్న ప్రజానీకంపై పెనుభారాలు మోపటం సమంజసం కాదు. ఈ భారాలన్నీ గత ప్రభుత్వపు వైఫల్యాలేనంటూ సమర్థించుకోవటం కూడా జన సమ్మతం కాదు.

# జార్ఖండ్ లో బిజెపి కుతంత్రాలు...

రాంచీ, ఏదో రకంగా ఎన్నికల్లో గెలవడం, అధికారాన్ని చేజిక్కించుకోవడం బిజెపి లక్ష్యం. దాని కోసం ప్రజలను చీల్చడానికి, వారి మధ్య ఘర్షణలు సృష్టించడానికి కూడా ఆ పార్టీ వెనకాడదన్నది ఇప్పటికే నిరూపితమైన సత్యం! మెజార్టీ ప్రజలను ఆకట్టుకోవడానికి ఒకవైపు తీవ్ర హిందుత్వాన్ని ముందుకు తీసుకువస్తూ, క్షేత్ర స్థాయిలో అవసరాలను బట్టి మనువాదాన్ని, కులతత్వాన్ని ఆశ్రయిస్తుంది. ఇటీవల జరిగిన హర్యానా ఎన్నికలతో పాటు, వివిధ రాష్ట్రాల్లో అనుసరిస్తున్న ఆ విద్వేష విష వ్యూహాన్నే జార?ండ్ ఎన్నికల్లో సైతం బిజెపి అనుసరిస్తోంది. రాష్ట్ర జనాభాలో 26 శాతం కంటే కొంచెం ఎక్కువగా ఉన్న గిరిజనుల ఓట్లను గంపగుత్తగా దండుకోవడమే లక్ష్యంగా బిజెపి నేతల ఈ విష ప్రచారం సాగుతోంది. ఈ రాష్ట్రంలోని 81 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 28 స్థానాలు షెడ్యూల్డ్ తెగలకు రిజర్వు అయ్యాయంటే ఆదివాసీ ఓట్ల ప్రాధాన్యతను అర్థం చేసుకోవచ్చు2019 అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడి ప్రజలు బిజెపిని తిరస్కరించారు. అప్పటి నుండి ఈ రాష్ట్రంపై బిజెపి ప్రత్యేకంగా దృష్టి సారించింది. మైనార్టీలను ప్రత్యేకించి ముస్లింలను బూచిగా చూపి గిరిజనుల్లో భయోత్పాతాలను రెచ్చగొట్టే యత్నాలు చేస్తోంది. బంగ్లాదేశ్ నుండి పెద్ద ఎత్తున చొరబాట్లు జరుగుతున్నాయని, దీని కారణంగా ఆదివాసీల భూములు, వనరులు ప్రమాదంలో పడతాయన్న ప్రచారాన్ని కొన్ని సంవత్సరాలుగా ఆ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున చేస్తున్నాయి. దీనిని ఆ రాష్ట్ర ప్రభుత్వం సవాల్ చేయడంతో హైకోర్టు జోక్యం చేసుకుని ఈ ప్రచారంలోని నిజానిజాలను తేల్చడానికి ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటీలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన ఉన్నతాధికారులు సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ విచారణ కొనసాగుతోంది. అయినా ఎన్నికల ప్రచారంలో ప్రధానమంత్రి ఈ విషయాన్ని ప్రస్తావించారు. ముస్లింలను చొరబాటుదారులుగా చిత్రీకరించడంతో పాటు వారు గిరిజనుల ఆహారాన్ని, కుమార్తెలను అపహరిస్తున్నారని చెప్పారు. దేశ ప్రధాని ఇలా మాట్లాడటం ఎంత దిగజారుడుతనం? ప్రజల మధ్య విభేదాలు సృష్టించి ఎన్నికల్లో లబ్ధి పొందాలన్న కపట వ్యూహం తప్ప దీనిలో మరేదైనా ఉందా? ఆవు చేలో మేస్తుంటే దూడ గట్టున మేస్తుందా? హోంమంత్రి అమిత్‌షా, అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ, కేంద్ర మంత్రి శివరాజ్ చౌహాన్‌లతో పాటు పలువురు ఇతర నాయకులదీ విద్వేషపు బాటే! ఇంతమంది, ఇంత బహిరంగంగా మత విద్వేషాలను రెచ్చగొడుతున్నా ఘనత వహించిన ఎన్నికల కమిషన్‌కు మాత్రం ఇవేమి పట్టడం లేదు. సుమోటోగా స్పందించాల్సిన ఇసి




ఫిర్యాదులు అందినా మౌనంగా ఉండటం దిగ్భ్రాంతికరం.ఎన్నికల వేళ ఏకరూప పౌర స్మృతి (యునిఫాం సివిల్ కోడ్-యుసిసి)ని బిజెపి తెరమీదకు తీసుకురావడం మరింత వివాదాస్పదంగా మారింది. కేంద్ర మంత్రి అమిత్ షా విడుదలచేసిన 'సంకల్ప పత్ర'లో తాము గెలిస్తే రాష్ట్రంలో యుసిసిని అమలు చేస్తామని, అయితే, దాని నుండి గిరిజనులను మినహాయిస్తామని బిజెపి పేర్కొంది. 'ఒకే దేశం..ఒకే చట్టం.. ఒకే ఎన్నికలు..' అంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో పాటు, ఆ పార్టీ నేతలందరూ ఊదరగొడుతుండగా, జార?ండ్‌లో యుసిసి నుండి గిరిజనులను మినహాయిస్తామని చెప్పడం బిజెపి కపట నాటకాన్ని బయటపెడుతోంది. ప్రజలను కులం, మతం ప్రాతిపదిక విభజించి రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించుకోవాలన్న బిజెపి ఆలోచన ధోరణికి ఈ ప్రకటన నిలువెత్తు నిదర్శనం. సమాజంలో అన్ని విధాలుగా వెనకబడి, తమవైన సొంత సంస్కృతి, సాంప్రదాయాలు కలిగి ఉన్న గిరిజనులకు యుసిసి నుండి ఇటువంటి మినహాయింపు ఇవ్వాల్సిందే! జార?ండ్‌లోని గిరిజనులకే కాదు, దేశమంతా ఇటువంటి విభిన్న సాంప్రదాయాలు కలిగిన వారు ఎందరో ఉన్నారు. అందులోనూ సామాజిక వివక్ష, ఆర్థిక వెనుకబాటుతనం, విభిన్న తెగల ఆచారాలు, సంస్కృతులను పరిగణలోకి తీసుకోకుండా ఏకపక్షంగా ఏకరూప పౌరస్మృతిని రుద్దడం సరికాదు. సున్నితమైన ఇటువంటి అంశాన్ని రాజకీయ స్వప్రయోజనాల కోసం వాడుకోవడం బిజెపి దివాళాకోరుతనానికి నిదర్శనం. చైతన్యవంతమైన జార?ండ్ ప్రజలు, ముఖ్యంగా దళితులు, మహిళలు, మైనార్టీలు, గిరిజనులు ఈ కుతంత్రాలను అర్థం చేసుకుని సమిష్టిగా తిప్పికొడతారని ఆశిద్దాం.

# భారత్‌తో బంధం బలపడేనా ?



న్యూఢిల్లీ,అమెరికా అధ్యక్షుడుగా ట్రంప్ మరోమారు ఎన్నిక కావడంతో..ఇప్పుడు మనదేశం కోణంలో చూస్తే సంబంధాలు బలంగానే ఉండే అకాశం ఉంది. ట్రంప్‌తో ప్రధాని మోడీకి మధ్య మంచి మిత్రుత్వం ఉన్న కారణంగా ఆశాజనకంగా ఉంటుందన్న అంచనాలు మొదలయ్యాయి. అయితే ప్రధానంగా హెచ్-1 వీసాలు, గ్రీన్ కార్డులు, ఉద్యోగావకాశాలు వంటి వాటిపైనే యువత దృష్టి సారిస్తోంది. నిజానికి ఇప్పుడు ఉద్యోగ భద్రత అన్నది అమెరికాలో లేకుండా పోయింది. ఏ రోజు ఎవరిని ఊడబెరుకుతారో అన్నది సమస్యగా మారింది. ఈ అంశాల్లో మోడీ కూడా ట్రంప్‌తో అమరమరికలు లేకుండా మాట్లాడాలి. అమెరికాకు మళ్లీ స్వర్ణయుగాన్ని తీసుకువస్తానని అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించిన డొనాల్డ్ ట్రంప్ ఇప్పటికే చెప్పారు. నిజానికి రాజకయాంగా మార్పు జరిగి నప్పుడు ప్రపంచంలో ఏ దేశంలో అయినా కొత్త ఆశలు పుట్టుకుని వస్తాయి. అగ్రరాజ్యం అమెరికాలో కూడా ఇప్పుడు అదే పరిస్థితి ఉంది. ఈ రాజకీయ మార్పు అమెరికాను మళ్లీ గొప్పదిగా చేసేందుకు దోహదం చేయగలిగితే..అది ప్రపంచ దేశాలపైనా ప్రభావంచూపుతుంది. ఈ ఎన్నికల్లో రిపబ్లికన్లు నిర్వహించిన ప్రచారం అతిపెద్ద రాజకీయ ఉద్యమంగానే చూడాలి. బైడెన్ వయసు మీద పడడంతో సరిగ్గా నిర్ణయాలు తీసుకోలేక పోయారు. అలాగే కమలా హారిస్ కూడా అధ్యక్షుడిని ప్రభావితం చేసి ధృఢమైన నిర్ణయాలకు అడుగువేయలేక పోయారు. ఇది ఓ రకంగా సగటు అమెరికన్లను కలచి వేసిందనే చెప్పాలి. అందుకే గతంలో ఎప్పుడూ లేనంతగా అమెరికా గతంలో ఎన్నడూ చూడని విజయాన్ని ట్రంప్ చేజిక్కించుకున్నారు. అందువల్ల ఈ విజయానికి మరింత ప్రాముఖ్యత ఉంది. అమెరికా ను బలంగా, సురక్షితంగా, సుసంపన్నంగా చేసేవరకు విశ్రమించబోనని కూడా ట్రంప్ ప్రకటించారు. దేశాన్ని తీర్చిదిద్దే ప్రయత్నంలో, తన కర్తవ్య నిర్వహణలో ప్రజలంతా చేతులు కలపాలని కోరుతున్నట్లుగా కూడా ట్రంప్ ప్రకటించారు. అమెరికా చరిత్రలో ఎప్పుడూ లేనంతగా ప్రజలు ఏకపక్షంగా ట్రంప్ విజయానికి దోహదపడ్డారు. భిన్నమైన సంస్కృతులు నేపథ్యాలున్నవారు ఉమ్మడి లక్ష్యాల కోసం ఏకతాటిపైకి రావడం చరిత్రాత్మకం. ప్రజలకిచ్చిన వాగ్దానాలు పూర్తిచేయడంలో ఏ శక్తీ తనను ఆపజాలదని ట్రంప్ కూడా ధృడంగానే ఉన్నారు. అసలైన అమెరికన్లకు దేశంలో ఉద్యోగ అవకాశాలు దక్కకుండా పోతున్నాయనీ, అమెరికా ఉత్పత్తుల అమ్మకాలకు అన్నిచోట్ల అడ్డంకులు ఎదురవుతున్నాయన్నదే ట్రంప్ నినాదం. తొలిసారి అధ్యక్షుడిగా ఎన్నికైనప్పుడు కూడా ఆయన ఇదే అభిప్రాయంతో ఉన్నారు. ట్రంప్ పదేపదే చెబుతు న్నట్లుగా.. అమెరికా ఎదుర్కొంటున్న ఈ సమస్యకు కారణం నాలుగు దశాబ్దాలుగా ఆ దేశ పాలకులు అనుసరించిన విధానాలేనని చెప్పవచ్చు. అలాగని అమెరికా మీద ఆధారపడ్డ ఇతర దేశాల వారిని చులకన చేయడం కూడా మంచిది కాదు. అన్ని దేశాల ఆర్థిక విధానాలను నయానా భయాన సరళీకరించి విదేశీ పెట్టుబడులకు ద్వారాలు తెరిచేలా చేసింది అమెరికా విధానకర్తలే. 1990ల నుంచి బాగా ఊపందుకున్న ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఒక దశ దాటిన తర్వాత అవసరమైన స్థాయిలో అమెరికన్ యువతకు ఉద్యోగాలను సృష్టించలేదు. ఈ రంగంలో కూడా చౌకగా లభ్యమయ్యే ఆసియా నిపుణులే ఎక్కువగా లబ్ది పొందారు. ఇటీవల వచ్చిన కృత్రిమ మేధో సాంకేతిక పరిజ్ఞానం కూడా ఊడిపోయే ఉద్యోగాలతో పోల్చితే సృష్టి అయ్యే ఉద్యోగాల సంఖ్య తక్కువే. కోవిడ్ అనంతరం ఐటీ రంగంలో హేమాహేమీలు అనదగిన కంపెనీలు కూడా పోటీలు పడి ఉద్యోగులను తగ్గించుకునే పనిలో పడ్డాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ట్రంప్ ప్రధానంగా మధ్యతరగతి శ్వేత జాతీయులను ఆకర్షించడవే లక్ష్యంగా చేసుకుని రాజకీయాలను మొదలుపెట్టారు. మొదటిదఫా అధ్యక్ష ఎన్నికల్లో పోటీపడేనాటికే ఆ దిశలో అడుగులు వేసి విజయం సాధించారు. శ్వేతజాతి మధ్యతరగతికి ఉద్యోగ అవకాశాలు దక్కకపోవటానికి విదేశాలే కారణమని దుమ్మెత్తిపోశారు. తన ఉత్పత్తులతో అమెరికా మార్కెట్‌ను ముంచెత్తిన చైనాతో మొదలుపెట్టిన రాజకీయయుద్ధంలో అవసరమను కున్న చోట భారత్‌నీ లాగారు. అమెరికా ఉత్పత్తులపై భారత్ విపరీతంగా దిగుమతి సుంకాలు విధిస్తోందని విరుచుకుపడ్డారు. తాజా ఎన్నికల్లో అయితే మంచి జీతాలుండే ఉద్యోగాలన్నిటినీ భారతీయులు కొట్టేస్తున్నారనీ ఆక్షేపించారు. వివిధ రంగాల్లో అమెరికా ఆధిపత్యం తగ్గటానికి, ఉద్యోగాల క్షీణతకు ఇతర దేశాల చర్యలే కారణమన్నట్లుగా ఆయన చేసిన ప్రచారానికి లక్ష్యం శ్వేత జాతీయులను ఆకర్షించడమే. అమెరికా జనాభాలో 60 శాతానికి కాస్త అటుఇటుగా ఉన్న శ్వేతజాతీయులను తనవైపు తిప్పుకోవటంలో మొదటిసారిలాగే రెండోసారి ట్రంప్ విజయం సాధించారు. శ్వేతజాతీయుల ఆధిపత్యానికి ముప్పు ముంచుకొస్తుందనే ఒకరకమైన భయాన్ని, ఆందోళనను కలిగించటంలో ట్రంప్ సఫలీకృతమయ్యారు. ఉద్యోగ భద్రతను, ఉద్యోగ కల్పనను తగినంత ఇవ్వలేని ఆర్థిక వ్యవస్థ అభద్రతా సమాజాన్ని సృష్టిస్తుంది. కాలం గడుస్తున్న కొద్దీ రాజకీయ నాయకుల్లో మార్పుని చూడటం సహజం. కానీ ట్రంప్‌ని నిశితంగా చూసిన వారెవరూ ఆయన ఆలోచనల్లో మార్పు వచ్చిందని భావించటం లేదు. నియంతలే కాకుండా, ప్రజాస్వామ్య ఎన్నికల ద్వారా అధికారం చేపట్టి నియంతృత్వ పోకడలను ప్రదర్శిస్తున్న నేతలు ట్రంప్ రెండోసారి అధికారం చేపట్టటాన్ని తమకు సానుకూలంగా భావిస్తున్నారు. రష్యా అధినేత పుతిన్ కొంత ఊపిరి పీల్చుకునే అవకాశం ఉంది. రష్యా పెట్టే షరతులకు ఉక్రెయిన్ అంగీకరించేలా చేసి యుద్ధాన్ని విరమింపచేస్తానని ట్రంప్ బహిరంగంగానే ప్రకటించారు. ఇజ్రాయెల్ నేత నెతన్యాహుకు కూడా ట్రంప్ పట్ల వ్యతిరేకత ఉందని చెప్పలేం. హమాస్ నిర్మూలన పేరుతో గాజాలో సాగుతున్న నరమేధాన్ని ఆపేలా ట్రంప్ తనపై ఒత్తిడి తెస్తారని ఇజ్రాయెల్ పాలకవర్గాలూ భావించటం లేదు. వీటన్నిటికంటే ముఖ్యమైంది వాతావరణ మార్పులపై కార్యాచరణ. అసలు వాతావరణ మార్పులే ప్రమాదకరంగా లేవనీ ప్రమాదకరమని ప్రచారం చేసే వాళ్లవి డొల్ల వాదనేనని ట్రంప్ అనేకసార్లు ఈసడించారు. ప్యారిస్ వాతావరణ ఒప్పందం నుంచి అమెరికా వైదొలుగుతున్నట్లు తాను గతంలో అధ్యక్షుడిగా ఉన్నప్పుడే ప్రకటించారు. పాత వైఖరికే కట్టుబడి ట్రంప్ వ్యవహరిస్తే ప్రపంచానికి వాతావరణపరంగా గడ్డుకాలం తప్పదనే అనుకోవాలి. మొత్తంగా భారత్‌తో ఉన్న సంబంధాల విషయంలో పెద్దగా కఠిన వైఖరిని ప్రదర్శించే అవకాశం ఉండకపోవచ్చు.

## మద్యం షాపును ముట్టడించిన మహిళలు

గుంటూరు,గుంటూరులో మహిళలు మద్యం షాపును ముట్టడించారు. మణీ హోటల్ సెంటర్‌లో ఇళ్ల, ప్రార్థన మందిరాల మధ్య మద్యం షాపు ఉండటంతో స్థానిక మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయంపై మద్యం షాపు నిర్వాహకులకు పలు మార్లు చెప్పిన పట్టించుకోలేదు. సమస్యను ఎక్సైజ్ సిబ్బందికి తీసుకెళ్లిన ప్రజల అభ్యర్థనను వారు లెక్కచేయనట్లు తెలుస్తుంది. ఇక విసుగు చెందిన స్థానిక మహిళలు మద్యం షాపును ముట్టడించారు. ఈ నేపథ్యంలో మహిళలు, మద్యం షాపు నిర్వాహకులకు మధ్య వాగ్వాదం జరిగింది. మద్యం షాపు అక్కడి నుండి తీసివేయాలని మహిళలు పెద్ద ఎత్తన ఆందోళన చేశారు. వారిపై మద్యం షాపు నిర్వాహకులు దురుసుగా ప్రవర్తించారు. కాగా, ఏపీలోని కొన్ని ప్రాంతాల్లో కొత్త లిక్కర్ షాపులు ప్రారంభమైన సంగతి తెలిసిందే. ప్రభుత్వం ప్రకటించిన లిక్కర్ పాలసీకి అనుగుణంగా అమ్మకాలు జరగడమే కాకుండా తిరిగి బ్రాండెడ్ అమ్మకాలు అందుబాటులోకి వచ్చాయి. అయితే, కొన్ని షాపులు ఇళ్లు, గుడులు, ప్రార్థన మందిరాల మధ్య ఉండటంతో స్థానిక మహిళలు నిరసనలు తెలుపుతున్నారు.

# ఫార్ములా ఇష్యూలో అసలు దోషి రేవంతే

హైదరాబాద్, ఫార్ములా ఈ రేసు విషయంలో అసలు దోషి రేవంత్ రెడ్డి అని, ప్రస్తుతం రాష్ట్రానికి మున్సిపల్ మంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డే.. రూ.50 కోట్లు నష్టపోవడానికి కారణమయ్యారని టీఎస్ రెడ్కో మాజీ చైర్మన్ వై.సతీష్ రెడ్డి ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాష్ట్రానికి రావాల్సిన దాదాపు రూ. 800 కోట్ల నుంచి రూ.900 కోట్ల పెట్టుబడులు రాకుండా అడ్డుకున్నారని విమర్శించారు. కావున రేవంత్‌పై చర్యలు తీసుకొని జైలుకు పంపాలన్నారు.ఎలక్ట్రిక్ వాహనాల వైపు ప్రజలు ఆసక్తి చూపించేలా వారికి అవగాహన కల్పించే ఉద్దేశంతో నాడు ఫార్ములా ఈ రేస్ నిర్వహించడానికి మున్సిపల్ శాఖ మంత్రిగా కేటీఆర్ ఎంత కష్టపడ్డారో.. రెన్యూయెబుల్ ఎనర్జీ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గా నేను దగ్గరుండి చూశాన్నారు. ఫార్ములా ఈ ఆపరేషన్స్ సంస్థను ఒప్పించి, ప్రమోటర్లను తీసుకొచ్చి విజయవంతంగా ఈవెంట్ నిర్వహించారు. మొట్టమొదటి ఫార్ములా ఈ రేస్ ఎక్కడ జరిగింది అంటే.. హైదరాబాద్ లోనే అని భవిష్యత్ తరాలు కూడా చెప్పుకుంటాయి. అంతేకాదు ఈ మొబిలిటీ వీక్ పేరుతో కార్యక్రమాలుచేపట్టి ఎలక్ట్రిక్ వాహనాల గురించి ప్రజలకు అవగాహన కల్పించే ప్రయత్నం చేశారని గుర్తు చేశారు. అలాగే ఫార్ములా ఈ రేస్ నిర్వహణతో హైదరాబాద్‌కు గ్లోబల్ ఇమేజ్ వచ్చింది. అంతర్జాతీయ ప్రముఖులు, సినీ, క్రీడారంగా ప్రముఖులు హైదరాబాద్‌కు వచ్చి ఈ ఈవెంట్‌లో పాల్గొన్నారు. ప్రస్తుతం బీజేపీ ఎంపీగా ఉన్న కొండా విశ్వేశ్వర్ రెడ్డి కూడా ఫార్ములా ఈ రేస్ ను స్వాగతించారు. స్వయంగా ఆయన కుమారుడే ఈ రేస్ లో పాల్గొన్నారని పేర్కొన్నారు. 2023లో జరిగిన ఈవెంట్‌కు ప్రభుత్వం చేసిన ఖర్చు ఒక్క రూపాయి కూడా వృథా కాలేదు. దాదాపు రూ.700 కోట్ల విలువైన పెట్టుబడులు వచ్చాయన్నారు. ప్రభుత్వం స్వయంగా ఖర్చు పెట్టింది తక్కువే అయినా.. రాష్ట్రానికి జరిగిన లాభం మాత్రం చాలా ఎక్కువని స్పష్టం చేశారు. 2024లో కూడా రేస్ మన రాష్ట్రంలోనే జరగాలని, మరిన్ని పెట్టుబడులు వస్తాయని కేటీఆర్ భావించారు.

# అప్పు ఆ కుటుంబం పాలిట శాపమైంది

హైదరాబాద్,చేసిన అప్పు ఓ కుటుంబం పాలిట శాపంగా మారింది. అప్పుల వాళ్ల వేధింపులు భరించలేక ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషాదకర సంఘటన నిజామాబాద్ జిల్లాలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..నిజామాబాద్ న్యాల్ కల్ రోడ్డులో నివాసం ఉండే వేణు(50) చిరు వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆయనకు భార్య అనురాధ, కూతురు పూర్ణిమ (24) ఉన్నారు. కాగా, వ్యాపార నిమిత్తం స్థానిక వడ్డీ వ్యాపారులు రోషన్, వికాస్ వద్ద రెండేళ్ల కింద రూ.3 లక్షల అప్పు తీసుకున్న వేణు మొత్తానికి వడ్డీతో సహా అసలు చాలావరకు కట్టాడు. అయినా వడ్డీ, చక్రవడ్డీల కింద జమ చేసి ఇంకా అప్పు కట్టాలని లేదంటే భార్యాకూతుళ్లను అందరిలో వివస్త్రలను చేస్తామని బెదిరించారు. దీంతో వడ్డీ వ్యాపారస్తుల వేధింపులు తట్టుకోలేక వేణు కుటుంబం బాసర వద్ద గోదావరిలో దూకారు. గమనించిన స్థానిక జాలరులు అనురాధను అతి కష్టం మీద కాపాడారు. వేణు మృతదేహం లభించింది. కూతురు పూర్ణిమ మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

# డిప్యూటీ సీఎం పవన్ కీలక వ్యాఖ్యలు

అమరావతి, గ్రామ వాలంటీర్లను జగన్ ప్రభుత్వం మోసం చేసి ఉద్యోగంలో పెట్టుకుందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో సర్పంచుల సంఘాల ప్రతినిధులతో పవన్‌కల్యాణ్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారితో పవన్ మాట్లాడుతూ ప్రభుత్వ రికార్డుల్లో ఎక్కడా గ్రామ వాలంటీర్ల అంశమే లేదని, అసలు ఉద్యోగాల్లోనే లేరంటే రద్దు అనే అంశం ఎక్కడుందని ప్రశ్నించారు. వైసీపీ జగన్ పాలనలో గ్రామ పంచాయతీ నిధులను దారి మళ్లించారని , రాష్ట్రంలోని 12,900 పంచాయతీల్లో నిధులను గత ప్రభుత్వం వాడేసుకుందని పేర్కొన్నారు. ఇతర అవసరాలకు రూ. 8,629 కోట్లు మళ్లించారని విమర్శించారు. మరో నెలలో రూ. 750 కోట్లు పంచాయతీల ఖాతాలకే రాబోతున్నాయని వెల్లడించారు. ఇప్పటికే సర్పంచుల డిమాండ్లలో కీలకమైనవి గుర్తించి పూర్తి చేశామని అన్నారు. కేరళ అధికారి కృష్ణతేజను డిప్యుటేషన్‌పై తీసుకొచ్చి ఆయన సహకారంతోనే గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేశామని వివరించారు. ఎంపీ నిధుల ద్వారా కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలు పూర్తి చేస్తున్నామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం పెండింగ్ నిధులు కూడా విడుదలకు కేబినెట్‌లో నిర్ణయించామన్నారు. గత ప్రభుత్వం బాధ్యత లేకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించిందని, వాటిని సరిచేయడానికి చంద్రబాబు అనుభవం కీలకంగా మారిందన్నారు .

## ఎమ్మెల్సీ ఎన్నికలను బైకాట్ చేసిన వైసీపీ

అమరావతి,ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలను బహిష్కరిస్తూ వైసీపీ కీలక నిర్ణయం తీసుకుంది. ఏపీలో గుంటూరు-కృష్ణా, ఉమ్మడి గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం కసరత్తు చేస్తుంది. ఈ సందర్భంగా వైసీపీ కూడా ఎన్నికలకు సన్నద్ధం అవుతుండగా సడెన్‌గా రెండు జిల్లాల్లో ఎన్నికలను బైకాట్ చేస్తున్నట్లు వైసీపీ నాయకుడు, మాజీ మంత్రి పేర్నినాని ప్రకటించడం సంచలనంగా మారింది. రాష్ట్రంలో శాంతియుత వాతావరణం లేదని, తమ నేతలను,కార్యకర్తలను అక్రమ కేసులతో వేధిస్తున్న పరిస్థితుల్లో బైకాట్ నిర్ణయం తీసుకున్నామని పేర్నినాని గురువారం తాడేపల్లిలోని వైసీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఏపీలో అప్రజాస్వామిక పాలన కొనసాగుతుందని, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వాపోవడం రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులకు అద్దం పడుతుందని వ్యాఖ్యనించారు.రాష్ట్రంలో శాంతి భద్రతల విషయంలో అత్యంత దయనీయ పరిస్థితిని ఎదుర్కొంటుందని ఆరోపించారు. అప్రజాస్వామికంగా పోలీసులను అడ్డంగా పెట్టి వైసీపీ రాజకీయ నాయకులపై వేధింపులకు పాల్పడుతున్న దృష్ట్యా వైసీపీ ఎమ్మెల్సీ పోటీ నుంచి దూరంగా ఉంటున్నట్లు తెలిపారు.

## ఏపీ డిప్యూటీ సీఎం సర్పంచ్ సంఘాలతో సమావేశం

అమరావతి, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అమరావతిలో సర్పంచ్ సంఘాలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వాలంటీర్ల వ్యవస్థపై ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. వాలంటీర్ వ్యవస్థను రద్దు చేయాలన్న సర్పంచుల విజ్ఞప్తిపై ఆయన స్పందించారు. వాలంటీర్లకు మేలు చేయాలనే ఆలోచలతోనే కూటమి ప్రభుత్వం ఉందన్నారు. కానీ, గత ప్రభుత్వం వారిని మోసం చేసిందని తెలిపారు.

## విజయవాడలో రైతుల ఇంటికి స్వయంగా వెళ్లిన ఏపీ మున్సిపల్ శాఖ మంత్రి

విజయవాడ, విజయవాడలో ఏపీ మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ గురువారం పర్యటించారు. అమరావతి ల్యాండ్ పూలింగ్ అనుమానాలను నివృత్తి చేసేందుకు ఆయన రైతుల ఇళ్లకు స్వయంగా వెళ్లారు. విజయవాడలోని రాజధాని రైతు అనుమోల్ గాంధీ నివాసానికి మంత్రి వెళ్లారు. ఇప్పటికే రాజధాని గ్రామాల్లో పలువురు రైతుల ఇళ్లకు స్వయంగా వెళ్లి పూలింగ్ అంగీకార పత్రాలను స్వీకరించారు. అయితే.. ఇప్పటి వరకు భూములు ఇవ్వని రైతుల ఇళ్లకు వెళ్లిన మంత్రి.. ల్యాండ్ పూలింగ్‌కు సంబంధించి వివరాలను వెల్లడిస్తున్నారు. గతంలో పలు అనుమానాలు, భయాలతో పలువురు రైతులు రాజధాని అమరావతికి భూములు ఇవ్వలేదు. వారి వల్ల రాజధాని డిజైనింగ్, నిర్మాణాలకు కొంత మేర ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడిన నేపథ్యంలో స్వయంగా మంత్రి నారాయణ రంగంలోకి దిగారు. భూములు ఇవ్వకుండా భయంతో, అనుమానాలతో ఉన్న రైతుల ఇళ్లకు మంత్రి నారాయణ వెళ్లి అన్నదాతలను కలుస్తున్నారు. ల్యాండ్ పూలింగ్, రాజధాని నిర్మాణం ఆవశ్యకతను వివరిస్తున్నారు. ప్రస్తుతం విజయవాడలో ఉన్న రాజధాని రైతు అనుమోల్ గాంధీ నివాసానికి మంత్రి వెళ్లి కలిశారు. రాజధాని అమరావతి ప్రాముఖ్యత, రాజధాని నిర్మాణం ఆవశ్యకతపై వివరించి.. రాజధానికి ఇవ్వాల్సిన భూములు ఇవ్వాలని వినతి చేశారు. ఇక ఇప్పటికే రాజధాని గ్రామాల్లో ఇప్పటి వరకు భూములు ఇవ్వని రైతుల ఇళ్లకు వెళ్లి పలువురిని స్వయంగా కలిసి... రాజధానికి భూములు ఇచ్చి రాజధాని నిర్మాణానికి సహకరించాలని నారాయణ చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తున్నట్లుగా తెలుస్తోంది. గత పదేళ్ల పాటు భూములిచ్చేందుకు నిరాకరించిన రైతులు ఇప్పుడు కాస్త మెత్తబడుతున్నట్లు సమాచారం. మంత్రి నారాయణ స్వయంగా ఇంటికెళ్లి.. భూముల విషయంలో ఆయన అడిగిన తీరుకు కొంతమంది రైతులు మెత్తబడి భూములు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. మంత్రి నారాయణ చేస్తున్న ఈ ప్రయత్నం పూర్తి స్థాయిలో సక్సెస్ అయితేనే రాజధాని నిర్మాణం వేగవంతం అవుతుంది.

## రాజన్న సిరిసిల్లలో అమానవీయ ఘటన

రాజన్న సిరిసిల్ల, తీసుకున్న డబ్బులు చెల్లించని కారణంగా ఓ మేస్త్రీ తల్లిని కాంట్రాక్టర్ తీసుకెళ్లిన అమానవీయ సంఘటన రాజన్న సిరిసిల్ల జిల్లాలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం... వేములవాడ అర్బన్ మండలం కొడుముంజ గ్రామానికి చెందిన పల్లపు శ్రీను అనే వ్యక్తి బండ పని మేస్త్రీగా పనిచేస్తున్నాడు. కాగా, మహారాష్ట్రకు చెందిన లాలు దేవకర్ అండ్ టీం కర్ణాటకలో చెరుకు తోటలను కోసే పనులను కాంట్రాక్టు తీసుకున్నారు. ఇందుకోసం కూలీలు అవసరం ఉండగా.. శ్రీను, అతడి సోదరుడిని సంప్రదించారు. ప్రస్తుతం శ్రీను, అతని సోదరుడు ఛత్తీస్‌గఢ్‌లో కూలీ పనులు చేస్తున్నారు. అయితే లాలు దేవకర్‌కు సంబంధించి కర్ణాటకలోని చెరుకు తోట కొట్టడానికి కావాల్సిన కూలీల కోసం ఛత్తీస్‌గఢ్‌కు చెందిన కూలీలతో శ్రీను ఒప్పందం కుదిర్చాడు. దీనికి మధ్య వర్తిత్వంగా శ్రీను వ్యవహరించాడు. ఇందుకోసం లాలు దేవకర్ రూ.3.80 లక్షలను కూలీలకు చెల్లించాడు. అయితే కూలీలు పనులకు రాకపోవడంతో లాలు దేవకర్‌కు, కొడుముంజకు చెందిన శ్రీను, అతడి సోదరునికి మధ్య వివాదం చోటుచేసుకుంది. తన డబ్బులు తిరిగి చెల్లించాలని లాలు దేవకర్ శ్రీను అతడి సోదరుడిపై ఒత్తిడి చేశాడు. ఈ విషయంలో పలుమార్లు చర్చలు జరిగాయి. ఈ క్రమంలో లాలు దేవకర్, మరికొంత మంది కొడుముంజ ఆర్అండ్ఆర్ కాలనీలోని శ్రీను ఇంటికి వచ్చి ఇంట్లో ఉన్న శ్రీను తల్లి పల్లపు భీమా బాయిని బలవంతంగా కారులోకి ఎక్కించి కిడ్నాప్‌కు పాల్పడ్డారు. డబ్బులిచ్చి తల్లిని తీసుకెళ్లాలంటూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## బెంగళూరులో బ్రిటన్ మాజీ ప్రధాని సందడి

బెంగళూరు, బ్రిటన్ మాజీ ప్రధాని, భారత సంతతికి చెందిన రిషి సునాక్ బెంగళూరులో మెరిశారు. తన భార్య అక్షతా మూర్తితో కలిసి ఓ కాఫీ షాప్‌లో సందడి చేశారు. స్థానికులతో ఫొటోలు, సెల్ఫీలు దిగుతూ ఆకట్టుకున్నారు. రిషి సునాక్, ఆయన భార్య అక్షతా మూర్తి ఇటీవలే బెంగళూరులోని థర్డ్ వేవ్ కాఫీ షాప్‌లో కాఫీ డేట్‌ను ఆస్వాదించారు. ఇద్దరూ టేబుల్ వద్ద కాఫీని ఎంజాయ్ చేస్తూ సరదాగా కబుర్లు చెప్పుకుంటూ కనిపించారు. ఆ సమయంలో కాఫీ షాప్‌కు వెళ్లిన స్థానికులు రిషి సునాక్ జంటను చూసి థ్రిల్ అయ్యారు. వారితో ఫొటోలు, సెల్ఫీలు దిగేందుకు ఎగబడ్డారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి. కాగా, రిషి సునాక్ 2022 నుంచి 2024 వరకు యూకే ప్రధాన మంత్రిగా పనిచేసిన విషయం తెలిసిందే. ఇటీవలే జరిగిన ఎన్నికల్లో రిషి సునాక్ పార్టీ ఓటమి చవి చూసింది. ఇన్ఫోసిస్ సంస్థ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి, సుధామూర్తి కుటుంబం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఎంతో విజయవంతంగా ఓ సాఫ్ట్‌వేర్ సంస్థను నడుపుతున్నప్పటికీ సాదాసీదా జీవితాన్ని గడుపుతుంటారు. వీరి కుమార్తే అక్షతా మూర్తి. అక్షత.. రిషి సునాక్‌కు ప్రేమ వివాహం చేసుకుంది. రిషి యూకే ప్రధానిగా ఉన్న సమయంలో అక్షతా మూర్తి బెంగళూరు వీధుల్లో తన తండ్రితో కలిసి షాపింగ్ చేసిన విషయం తెలిసిందే. తండ్రి నారాయణమూర్తి, తల్లి సుధామూర్తి, ఇద్దరు కుమార్తెలు అనౌష్క, కృష్ణతో కలిసి నగరంలోని రాఘవేంద్ర మఠాన్ని సందర్శించారు. అయితే, ఆ టైంలో ఎలాంటి భద్రత లేకుండా సాధారణ పౌరుల్లా అక్కడ మొత్తం కలియతిరగడం అప్పట్లో హాట్‌టాపిక్‌గా మారింది. అంతేకాదు పలు సందర్భాల్లోనూ వీరు సిలికాన్ సిటీలో సందడి చేశారు.

## తెలంగాణలో పలువురు డీఎస్పీల బదిలీ

హైదరాబాద్, తెలంగాణలో పలువురు డీఎస్పీ అధికారులు బదిలీ అయ్యారు. ఈ మేరకు డీజీపీ ఇవాళ (గురువారం) ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం వెయిటింగ్‌లో ఉన్న అధికారి ఎస్ఆర్ దామోదర్ రెడ్డిని అంబర్‌పేట్ డీఎస్పీ, పీటీసీగా బదిలీ చేశారు. ప్రస్తుతం జగిత్యాల డీఎస్పీ, డీసీఆర్‌బీగా ఉన్న జీ మహేశ్ బాబుని కరీంనగర్ డీఎస్పీ, పీటీసీగా బదిలీ చేశారు. ఇక కరీంనగర్ డీఎస్పీ, పీటీసీగా ఉన్న బీ.రామానుజంను కాగజ్‌నగర్ ఎస్‌డీపీవోగా ట్రాన్స్‌ఫర్ చేశారు. కాగజ్‌నగర్ ఎస్‌డీపీవోగా ఉన్న ఏ.కరుణాకర్‌ను ఆసిఫాబాద్ ఎస్‌డీపీవోగా బదిలీ చేశారు.

# గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో మరణమృదంగం



అమరావతి,పార్వతీపురం మన్యం జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో మరణ మదంగం కొనసాగుతూనే ఉంది. జిల్లాలో ఎక్కడో ఒకచోట విద్యార్థులు అనారోగ్యానికి గురై పిట్టల్లా రాలుతున్నారు. ఏ పాఠశాలలో ఎప్పుడు, ఎవరికి ఏమవుతుందో తెలియక భయంతో తల్లిదండ్రులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఆశ్రమ పాఠశాల్లో వరుసగా కొనసాగుతున్న విద్యార్థుల మరణాలతో అటు తల్లిదండ్రులు, ఇటు విద్యార్థులు బెంబేలెత్తిపోతున్నారు. రెండు రోజుల వ్యవధిలో ముగ్గురు మరణించడంతో జిల్లా వ్యాప్తంగా వసతిగృహాల్లో పరిస్థితిపై ఆందోళన వ్యక్తమవుతోంది.

గిరిజన విద్యార్థి ఆకస్మిక మృతి

జియ్యమ్మవలస మండలంలోని రావాడ రామభద్రపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల ఏడో తరగతి విద్యార్థి నిమ్మక జీవన్ కుమార్ (12) ఆకస్మికంగా మృతి చెందాడు. బుధవారం తెల్లవారుజామున తనకు ఎక్కువగా తలనొప్పి ఉందని తోటి విద్యార్థులకు చెప్పాడు. వారు వెంటనే డిప్యూటీ వార్డెన్ ఆర్.గణపతిరావుకు సమాచారమిచ్చారు. దీంతో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి జీవన్‌ను తీసుకెళ్లారు. వైద్యాధికారి సిహెచ్ శంకర్రావు విద్యార్థికి చికిత్స అందించేలోగా జీవన్ ఒక్కసారిగా కుప్పకూలి ప్రాణం విడిచినట్లు నిర్ధారించారు. ఈ విషయం తెలుసుకున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.తిరుపతిరావు.. గుమ్మలక్ష్మీపురం మండలం వనకాబడి పంచాయతీ ఒంజిడి గ్రామానికి చెందిన విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారాన్ని అందించారు. కుమారుడి హఠాణ్మరణాన్ని తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోతున్నారు.

జ్వరంతో బాలుడు మృత్యువాత

కురుపాం మండల కేంద్రంలో గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న నిమ్మక నితిన్(9) అనారోగ్యంతో మృతి చెందాడు. జ్వరంతో బాధపడుతున్న నితిన్‌ను కుటుంబ సభ్యులు గత నెల 22న కురుపాం సిహెచ్‌సికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స అనంతరం పార్వతీపురం తరలించారు. అక్కడ చిక్సిత చేయగా జ్వరం తగ్గడంతో తిరిగి ఇంటికి తీసుకొచ్చారు. దసరా సెలవులకు ఇంటికి వెళ్లిన విద్యార్థి తిరిగి రాకపోవడంతో సోమవారం హాస్టల్ సిబ్బంది కురుపాం మండలం గుజ్జలగండ గ్రామంలో ఉన్న నితిన్ ఇంటికి వెళ్లారు. విద్యార్థి మళ్లీ తీవ్రమైన జ్వరంతో బాధపడటంతో వెంటనే కుటుంబ సభ్యులతో కలిసి వార్డెన్ సూర్యనారాయణ దుడ్డుఖల్లు పిహెచ్‌సికి తీసుకెళ్లారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రికి రిఫర్ చేశారు. పరిస్థితి విషమించడంతో విశాఖపట్నం కెజిహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం రాత్రి మృతి చెందాడు.

# మూసీ పునరుజ్జీవనంతో బాధెవరికి? మేలెవరికి?

హైదరాబాద్,నదుల వెంట నాగరికత విలసిల్లిందని మానవ వికాస చరిత్ర చెబుతోంది. నగరాలు నరక కూపాలై నదులను విషతుల్యం చేయడం మన కళ్లముందరి ఆధునిక వాస్తవం. పరిశ్రమల విష రసాయనాలు, మానవ వ్యర్థాలు, ఇతర మురుగుతో కాలుష్యమైన మూసీ దేశంలోనే అత్యంత విషపూరితమైన నదిగా, ప్రపంచం లోని పాతిక అతి కాలుష్య నదుల్లో ఒకటిగా రికార్డులకెక్కింది. రాజధాని హైదరాబాద్ నగరం గుండా ప్రవహించే ఈ ప్రకృతి జల సంపదను దశాబ్దాల నిర్లక్ష్యంతో నాశనం చేసుకున్న హీనచరిత్ర మనది. దిగువ గ్రామీణ ప్రాంతాల్లో సగటు మనిషి జీవితాన్ని ఇది దుర్భరం చేస్తోంది. పరీవాహక ప్రాంతంలో భూగర్భ జలాలు కాలుష్యమై రసాయన అవశేషాలు పంటల నుంచి పాల వరకు విస్తరిస్తున్నాయి. చర్మవ్యాధుల నుంచి కేన్సర్ల దాకా, వింత జబ్బుల నుంచి గర్భస్రావాల దాకా ప్రజాజీవితం అతలాకుతలమవుతోంది. కారణమేదైనా మూసీ పునరుజ్జీవన కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రకటించింది. దాన్ని వ్యతిరేకించడం ఎందుకు? ఎలా జరగాలో డిమాండ్ చేయాలి, మంచే జరిగేలా ఒత్తిడి తెచ్చి సాధించాలి!ప్రజా సమస్యల విషయంలో నిరసనలు, ఆందోళనలు, చివరకు ఉద్యమాలూ వస్తుంటాయి. వాటికి స్పందనగా ప్రభుత్వాల నుంచి విధాన నిర్ణయాలు, ఆ మేరకు ప్రకటనలు వస్తుండటం రివాజు. కానీ, అందుకు పూర్తి భిన్నంగా జరుగుతున్న ఓ పరిణామంలో ప్రజలు, ప్రజాసమూహాలు, పౌర సమాజం, రాజకీయ పక్షాల స్పందన ఆశించిన రీతిలో లేకపోవడం బాధాకరం. వందేళ్ల కిందట నగరాన్ని నీళ్లతో ముంచెత్తిన ఓ ప్రకృతి విపత్తు తర్వాత మానవ పరిష్కారంగా మూసీపై తొలి సంస్కరణ జరిగింది. నిజాం వినతి మేరకు ప్రఖ్యాత ఇంజనీరు మోక్షగుండం విశ్వేశ్వరయ్య చొరవతోమూసీ, ఈసీలపై రెండు తాగునీటి తటాకాలను కట్టి, వరద ఉధృతిని కట్టడి చేశారు. హైదరాబాద్ – సికింద్రాబాద్‌ను వేర్పరుస్తూ నగరం గుండా సాగే మూసీపై వందేళ్లుగా ఏ సానుకూల మార్పు లేకపోగా, మన నిర్లక్ష్యం వల్ల పరిస్థితులు దిగజారాయి.ఏమో? మళ్లీ వందేళ్ల దాకా ఎవరైనా ఇటువైపు దృష్టి పెడతారో, పెట్టరో తెలియదు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రతిపాదన చేసి, నదిని పునరుజ్జీవింపజేసే పనికి నడుం కట్టింది. కాలుష్య కాసారంగా మారిన మూసీని బాగు చేస్తామని, ప్రక్షాళనతో పునరుద్ధరిస్తామని, నీటిని శుద్ధిపరచి – పరిసరాలను మెరుగుచేసి పూర్వవైభవంతో నదిని పునరుజ్జీవింప చేస్తామనీ ప్రకటిస్తే%" ఎవరికైనా దీన్ని వ్యతిరేకించాల్సిన అవసరం ఏముంటుంది అనే ప్రశ్న సహజం! ప్రకటన వెలువడ్డ సమయం, సందర్భం, క్రమం పట్ల అభ్యంతరాలుండొచ్చు. తలపెట్టిన ప్రాజెక్టు విధానమో, అనుసరిస్తున్న పద్ధతో, ప్రతిపాదిస్తున్న అంశాలో నచ్చకపోవచ్చు. అప్పుడు, అంతే నిర్దుష్టంగా వాటిని ఎత్తిచూపి వ్యతిరేకించాలి తప్ప మొత్తం ప్రాజెక్టే తప్పనడం సరికాదు. కానీ, మూసీపై మాటలు మొదలైన నుంచీ కొందరు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఘాటుగా విమర్శిస్తున్నారు. ఇది కమీషన్ల కోసమేనని ఆరోపిస్తున్నారు. ‘ఇదా! మీ ప్రాధాన్యతా కార్యక్రమం?’ అని ప్రభుత్వాన్ని వారు నిలదీస్తున్నారు. అలా కాకుండా ప్రతిపాదిత ప్రాజెక్టులో ఏది సబబో? ఏది కాదో? వివరంగా చెప్పాలి. అందుకు ఒక ఆరోగ్యకరమైన చర్చ జరగాలి. మొత్తం ‘మూసీ పునరుజ్జీవన’ కార్యక్రమాన్ని వ్యతిరేకించడం సరికాదు.

పాదయాత్రతో డిమాండ్ పేరిగేనా?

ప్రజాస్వామ్య ప్రభుత్వాలు ఏది తలపెట్టినా ప్రజలను భాగస్వాములు చేయడం వల్ల సత్ఫలితాలుంటాయి. మూసీ పరిసర గ్రామీణ ప్రాంతాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాదయాత్ర కార్యక్రమం ఖరారైనట్టు వార్తలొస్తున్నాయి. ఆయా గ్రామాల్లో పర్యటిస్తూ మూసీ కాలుష్యానికి ప్రభావితులవుతున్న రైతులు, చేతి వృత్తులవారు, ఇతర కూలీలతో ఆయన మాట్లాడి వారి అభిప్రాయలు తెలుసుకుంటే ఇదొక మంచి ప్రయత్నమే! ‘నాయిన దసరాకు కొత్తబట్టలు కొనిస్తడా? కొనియ్యడా? అన్నంత వరకు అది సమస్యే! కానీ, కొనిస్తాను పద నీకు ఏం బట్టలు కావాలి? అని నిర్ణయం చెప్పాక బెట్టుచేయడం సరికాదు. వెంట వెళ్లి, ఏం బట్టలు కావాలో, డిజైన్ ఎలా ఉండాలో ఎంపిక చేసుకోవడం పిల్లల బాధ్యత. ఇదీ అలాంటిదే. ప్రభుత్వం వెంట ఉండి మూసీ పునరుజ్జీవనం ఎలా జరగాలో పౌరులు, పౌరసమాజం, మేధావులు, ప్రజా సంఘాల చర్చించుకొని ప్రతిపాదనలు చేయాలి’ అన్న జియో సైంటిస్ట్ డాక్టర్ నక్కా సాయిభాస్కర్ మాటలు అక్షర సత్యాలు.ఆయన మూసీ యాత్ర చేస్తున్నారిపుడు. వికారాబాద్ కొండల్లో పుట్టి మొత్తం 240 (రాజధాని నగరంలో 55) కి.మీ మేర ప్రయాణం చేసి సూర్యాపేట జిల్లా వాడపల్లి వద్ద కృష్ణాలో కలిసే ఉపనది మూసీ! కాలుష్యాన్ని అరికట్టడమే కాకుండా నగర సుందరీకరణతో పాటు బహుళప్రయోజనాలకుద్దేశించిన ఈ పథకం సమర్థ అమలుకు అందరి సహకారం అవసరం. ‘మూసీ రివర్ బెల్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్‌డిసిఎల్) ప్రత్యేక విభాగాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. సమగ్రంగా ప్రాజెక్టును రూపకల్పన చేయడంతో పాటు డిజైన్లు ఇవ్వాల్సిందిగా టెండర్లు ఆహ్వానించి, రూ. 160 కోట్లు వెచ్చించడానికి ప్రభుత్వం సిద్ధమైంది. పబ్లిక్–ప్రయివేటు పార్టనర్‌షిప్ (పిపిపి) పద్ధతిన చేపట్టే ఈ సమగ్ర ప్రాజెక్టు కోసం అవసరమైతే రూ. 1.5 లక్షల కోట్ల మేర వ్యయ నిర్వహణకు సిద్ధమేనని ప్రకటించింది. మూసీ నీటిని శుద్ధి చేసి, బాపూఘాట్ వద్ద పెద్ద గాంధీ విగ్రహం ఏర్పాటుతో పాటు 200 ఎకరాల్లో గాంధీ విజ్ఞానాల అభివృద్ధి



కేంద్రం, పర్యాటకాభివృద్ధి చేస్తామంటున్నారు.

భరోసా కావాలి

నగరం గుండా మూసీ ప్రవహిస్తున్న 55 కి.మీ మేర, ఇరువైపులా 55 మీటర్ల చొప్పున బఫర్ జోన్‌గా ప్రకటించి ఖాళీచేయిస్తున్నారు. దురాక్రమణలే అయినా సుదీర్ఘకాలంగా ఉంటున్నారనే కారణంగా కనీస న్యాయానికి ఒక ప్రాతిపదిక పెట్టుకున్నారు. వేల కొలది నిరుపేద కుటుంబాలే కాక మూసీతీరంలో కొన్ని వేల భవన నిర్మాణాలు, వందలాదిగా ఖాళీ స్థలాలున్నాయి. అవి తొలగిస్తున్నపుడు.. ప్రత్యామ్నాయంగా నిర్వాసితులకు ‘డబుల్ బెడ్రూం’ ఇళ్లు ఇస్తున్నామని, వాణిజ్య భవనాలు, స్థలాలు కోల్పోతున్నవారికి నష్టపరిహారం చెల్లిస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఆధునిక అభివృద్ధి కార్యక్రమాల పర్యవసానాల్లో ఇదొకటని తెలిసిందే! ఇచ్చే నష్టపరిహారం ఎంత న్యాయబద్ధంగా ఉందో ప్రజాసంఘాలు, పౌరసమాజం గమనించాలి. జీవనోపాధులతో కూడిన చోట నిర్వాసితుల్ని చేసి, ఇంకెక్కడో ఇళ్లు ఇస్తామంటారా? అని కొన్ని రాజకీయ పక్షాల వారు ప్రశ్నిస్తున్నారు. అంతకన్నా, ఇళ్లు ఇస్తున్న చోట ఉపాధి అవకాశాలు మెరుగుకోరడం సహేతుకంగా ఉంటుంది.ఎన్నికలప్పుడు ఇచ్చిన ‘ఆరు హామీలు’ అమలు చేయకుండా పక్కకు నెట్టి, మూసీ సుందరీకరణకు తొందర మీకు ప్రాధాన్యతాంశమైందా? అని విపక్ష పార్టీల వారు విమర్శిస్తున్నారు. ప్రజాధనం నుంచి వెచ్చించేది పెద్దగా ఉండదని, పిపిపి పద్ధతిలోనే ఈ ప్రాజెక్టు వ్యయం ఉంటుందని సర్కారు వారు చెబుతున్నారు. ఈ అంశాలపై చర్చ జరగాలి. ప్రయివేటు భాగస్వామ్యంతో మూసీ పునరుజ్జీవన కార్యక్రమం చేపడితే పెట్టుబడులకు ఎవరు ముందుకు వస్తున్నారు? వారు ఏంత వ్యయం చేస్తారు? ఏమాశిస్తారు? ప్రతిగా ప్రభుత్వం ఏం ఇస్తుంది? ఇలాంటి విషయాల్లో మరింత స్పష్టత అవసరం.

నీటి శుద్ధితో సర్వం సాధ్యం

‘నగరపాలక సంస్థ చేసే తడిచెత్తా, పొడిచెత్త నిర్వహణలాగే మూసీ ప్రక్షాళన చేస్తే, ఇక అంతకన్నా చెత్త మరోటుండదు’ అని సీనియర్ జర్నలిస్ట్ చెన్ను శివప్రసాద్ చేసిన వ్యాఖ్య కర్తవ్యబోధ చేస్తుంది. తడిచెత్త, పొడిచెత్త నిర్వహణకు వేర్వేరుగా రెండు చెత్తబుట్టలు సరఫరా చేసే మహానగర సంస్థ తరపున, ఆ చెత్త సమీకరణకు వచ్చే వాహన సిబ్బంది రెండు బుట్టల్ని ఒకే చోట గుమ్మరించుకొని పోతారు. మూసీలోకి వచ్చే మురికి నీటి శుద్ధి చర్యలూ అలాగే ఉంటున్నాయి. నగర శివారుల్లో రోజూ సగటున రెండు వేల మిలియన్ లీటర్ల (ఎంఎల్‌డి) మురుగు ప్రవహిస్తూ నదిలోకి వస్తుంటే, సుమారు 800 ఎంఎల్‌డి మురుగును మాత్రమే సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్‌టిపి) ల ద్వారా శుద్ధిచేసి, ఈ నీటిని మూసీలోకి వదులుతున్నారు. అదే సమయంలో, మిగతా 1200 ఎంఎల్‌డి మురుగును శుద్ధి చేయకుండానే మూసీలోకి వదులుతున్నారు. ఎక్కడోచోట రెండు కలిసిపోతున్నాయి.ఇక శుద్ధి చేసి ఏం ఉపయోగం? మరొక ఇబ్బంది ఏమంటేమురుగునీటి కాలువలు, వర్షపు నీటి కాలువలు వేర్వేరుగా ఉండాలి. కానీ, సరైన నిర్వహణా మరమ్మతులు లేక జంట నగరాల్లో సుమారు యాభై శాతం వర్షపు నీటి డ్రెయిన్లు, మురుగునీటి డ్రెయిన్లతో కలిసిపోయాయి. విడిగా ఉంటే, ఏ శుద్ధీకరణ అవసరం లేకుండానే వర్షపు నీరు నేరుగా మూసీలోకి వెళుతుంది. మురుగుతో కలిసిపోవడం వల్ల, ఎస్‌టిపిల ద్వారా శుద్ధి చేయాల్సిన మురుగు పరిమాణం పెరిగి శుద్ధీకరణ భారమవుతోంది. సుమారు పాతిక ఎస్‌టిపిలు మాత్రమే పని చేస్తున్నాయి. మరో 40 ఎస్‌టిపిల వరకు సిద్ధమవుతున్నాయి. కనీసం వంద ప్లాంట్ల అవసరం ఉంటుందనే ఉద్దేశంతో మరో 30 ఎస్‌టిపిలు ఏర్పరచుకునే కసరత్తు సాగుతోంది.

జన్మస్థానం నుంచి మొదలైతేనే..

‘మూసీ సుందరీకరణ’ కన్నా ‘మూసీ ప్రక్షాళన’ అర్థవంతమైన పదబంధం. కాలుష్యం తొలగించి, నీటిని శుద్ధిపరచకుండా సుందరీకరణ అసాధ్యం. ‘మూసీ ప్రక్షాళన’ కన్నా ‘మూసీ పునరుజ్జీవనం’ మరింత ప్రజాస్వామ్యయుతమైన ప్రతిపాదన. ఇది జరగాలంటే, ప్రాజెక్టు కింద చేపట్టే పనులు, నగరం గుండా మూసీ ప్రవహించే 55 కి.మీ కే పరిమితం చేస్తే ఉపయోగం లేదు. మూసీ జన్మస్థానమైన వికారాబాద్ గుట్టల నుంచి మొదలవాలి. ఏడాది పొడుగూ నదిని సజీవంగా ఉంచే సహజ వనరులను సంరక్షించాలి.విధాన నిపుణులు దొంతి నర్సింహారెడ్డి చెప్పినట్టు, స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ‘మూసీ క్యాచ్‌మెంట్ ఏరియా అథారిటీ’ ఏర్పాటు చేయాలి.

## వాతావరణంలో ఎలాంటి మార్పు రాలేదు

న్యూఢిల్లీ,దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం రోజురోజుకూ తీవ్రమవుతోంది. గత కొన్ని రోజులుగా ఢిల్లీ ఎన్సీఆర్ ప్రాంతంలో గాలి నాణ్యత చాలా పేలవమైన స్థాయిలో నమోదవుతోంది. ఏక్యూఐ లెవల్స్ రాజధాని ప్రాంతంలో 400కుపైనే నమోదవుతోంది. పొరుగు రాష్ట్రాలైన పంజాబ్, హర్యానాల్లో రైతులు తమ పంట వ్యర్థాలను తగలబెడుతుండటంతో రాజధాని ప్రాంతంలో ఈ పరిస్థితి తలెత్తుతోంది. కాలుష్య నియంత్రణకు పాలకులు ఎన్ని చర్యలు చేపట్టినా ఫలితం ఉండటం లేదు. రోజురోజుకూ గాలి నాణ్యత క్షీణిస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. పంట వ్యర్థాలను దహనం చేసే రైతులకు రెట్టింపు జరిమానా విధించేలా నిబంధనలను సవరించింది. రూ.30 వేల వరకూ జరిమానాను పెంచింది. ఈ నిబంధనలు తక్షణమే అమల్లోకి వస్తాయని తెలిపింది. కేంద్ర నిబంధనల ప్రకారం.. రెండు ఎకరాల్లోపు భూమి ఉన్న రైతులకు రూ.5 వేల జరిమానా విధించనున్నారు. రెండు నుంచి ఐదు ఎకరాల మధ్య ఉన్న వారికి రూ.10 వేలు, ఐదెకరాల కంటే ఎక్కువ భూమి ఉన్న రైతులకు రూ.30 వేలు జరిమానా విధించనున్నారు. కాగా, కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రకారం.. ఉదయం 9 గంటలకు ఢిల్లీలో గాలి నాణ్యత 367గా నమోదైంది. ఆనంద్ విహార్, జహంగీర్‌పురి, అశోక్ విహార్, బావన, ముండ్కల్, రోహిని, సోనియా విహార్, వివేక్ విహార్, వాజీపూర్.. ఈ తొమ్మిది ప్రాంతాల్లో గాలి నాణ్యత తీవ్రమైన కేటగిరీలో ఉందని కాలుష్య నియంత్రణ మండలి తెలిపింది. మరోవైపు కాలుష్యం కారణంగా ఢిల్లీ వాసులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. ఓ వైపు వాయు కాలుష్యంతో ఊపిరితీసుకోవడం ఇబ్బందికరంగా మారగా.. మరో వైపు నీటి కాలుష్యంతోనూ సతమతమవుతున్నారు. యయునా నదిలో కాలుష్య స్థాయి విపరీతంగా ఉన్నది.

## సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ చీఫ్‌గా కశ్యప్ పటేల్

న్యూఢిల్లీ,సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ చీఫ్‌గా కశ్యప్ పటేల్‌కు అవకాశం దక్కనున్నది. అమెరికా కొత్త అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్.. భారతీయ సంతతికి వ్యక్తికి ఆ కీలక పదవిని అప్పగించే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ట్రంప్ కోసం ఏపని అయినా చేసేందుకు కశ్యప్ సిద్దంగా ఉన్నారు. అయితే కశ్యప్ పటేల్‌కు గుజరాతీ మూలాలు ఉన్నాయి. ఈస్ట్ ఆఫ్రికాలో ఆయన పేరెంట్స్ పెరిగారు. 1970 దశకంలో ఆయన తండ్రి ఉగాండా నుంచి వలస వచ్చారు. 1980లో న్యూయార్క్ గార్డెన్ సిటీలో ఆయన జన్మించారు. హిందువుగా ఆయన పెరిగారు. వర్ణ వివక్షకు వ్యతిరేకంగా ఆయన పోరాడారు. రిచ్‌మండ్ యూనివర్సిటీలో ఆయన గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. న్యూయార్క్‌లో లా డిగ్రీ చదివారు. యూకేలోని యూనివర్సిటీ కాలేజీ లండన్ ఫాకల్టీ ఆఫ్ లాస్ నుంచి ఇంటర్నేషనల్ లా సర్టిఫికేట్ పొందారు. రక్షణశాఖ మాజీ కార్యదర్శి క్రిస్టోఫర్ మిల్లర్ వద్ద పనిచేశారు. నేషనల్ సెక్యూర్టీ కౌన్సిల్‌లో కౌంటర్ టెర్రరిజం సీనియర్ డైరెక్టర్‌గా చేశారు. గతంలో డోనాల్డ్ ట్రంప్ ప్రభుత్వ సమయంలో.. ఐసిస్, ఆల్‌ఖయిదా కీలక నేతల హత్యలకు మిషన్ నడిపించారు. హౌజ్ కమిటీకి చెందిన ఇంటెలిజెన్స్‌కు నేషనల్ సెక్యూర్టీ అడ్వైజర్‌గా చేశారు. 2016 ఎన్నికల్లో రష్యా ప్రమేయంపై విచారణాధికారిగా చేశారు. లాయర్‌గా అనేక కేసుల్ని వాదించారు. హత్యలు, నార్కో ట్రాఫికింగ్, ఆర్థిక నేరాల గురించి ఫెడరల్ కోర్టుల్లో వాదించారు. 2019లో ట్రంప్ టీంలో కశ్యప్ పటేల్ చేరినట్లు ఓ రిపోర్టు ద్వారా తేలింది. గత పాలన సమయంలో సీఏఐ డిప్యూటీ డైరెక్టర్‌గా కశ్యప్ పటేల్‌ను నియమించాలని ట్రంప్ ప్లాన్ వేసినట్లు తెలిసింది.

## గత జగన్ దుర్మార్గ పాలన వల్ల రాష్ట్రం వెనుకబాటు

అమరావతి, ఐదేళ్లు సీఎంగా జగన్ చేసిన పాపాలతో నేడు ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. గురువారం రాజధాని అమరావతి ప్రాంతంలో పర్యటించిన ఆయన తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం గ్రామంలో నిర్మించిన విద్యుత్ ఉపకేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. జగన్ దుర్మార్గ పాలనతో రాష్ట్రం వెనకబడిందన్నారు. వైసీపీ పాపాలకు జనం బలవుతున్నారన్నారు. జగన్ చేసిన పాపాలకు బదులుగా ఓటర్లు ఎన్నికల్లో వాతలు పెట్టి ఇంటికి పంపించారన్నారు. దుర్మార్గులకు అధికారం ఇవ్వడమే ప్రజలు చేసిన తప్పన్నారు. కేంద్రం ఇచ్చిన నిధులను గత వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించిందని, దీంతో కేంద్రం నిధులు ఇవ్వని పరిస్థితిని తీసుకొచ్చారన్నారు. పోలవరం డయాఫ్రమ్ వాల్‌ను నాశనం చేశారని చంద్రబాబు విమర్శించారు. జగన్ అరాచక పాలనతో పోలవరం వెనక్కి వెళ్లిందన్నారు. రాష్ట్రంలో రహదారులను గోతుల మయం చేశారన్నారు. అభివృద్ధిని పక్కనపెట్టి గత వైసీపీ ప్రభుత్వం ప్రజల సొమ్మును దోచుకుందని ఆరోపించారు. తాను సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత నుంచి విద్యుత్తు ఛార్జీలు పెరగవని తాను హామీ ఇస్తున్నట్లు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పుల కారణంగానే ఇటీవల విద్యుత్తు ఛార్జీలు పెరిగాయన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం..

రాజధాని ప్రాంతం అభివృద్ధి కోసం 400 కేవీ విద్యుత్ సరఫరా లైన్లు శాశ్వత మళ్లింపు పనులను ముఖ్యమంత్రి ప్రారంభించారు. రాష్ట్రంలో అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా అందించేదుకు రూ.505 కోట్లతో నిర్మించిన జీఐఎస్ విద్యుత్ సబ్ స్టేషన్‌ను చంద్రబాబు ప్రారంభించడంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా రూ. 5407 కోట్లతో నిర్మించిన సబ్ స్టేషన్లకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఎన్టీఆర్ జిల్లా, గుంటూరు, చిత్తూరు, నంద్యాల, శ్రీ సత్య సాయి, శ్రీకాకుళం, అనకాపల్లి, కృష్ణా, ప్రకాశం, తిరుపతి, కడప జిల్లాల్లో విద్యుత్ సబ్ స్టేషన్లను సీఎం చంద్రబాబు చేతుల మీదుగా వర్చువల్‌గా ప్రారంభించారు. సీఆర్డీయే పరిధిలో భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తాళ్ళాయపాలెంలో 400 కేవీ విద్యుత్తు సబ్‌స్టేషన్‌ను నిర్మించారు. ఆర్థిక అభివృద్ధి సాధించడంలో 24.7 గంటలు విద్యుత్ సరఫరా కీలక పాత్ర పోషించనుంది.

రాజధాని ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం క్రమక్రమంగా అడుగులు ముందుకు వేస్తోంది. ఇందులో భాగంగా రాజధాని ప్రాంతంలో తాళ్లాయపాలెంలో 400/220 కెవి గ్యాస్ ఇన్సులేటెడ్ విద్యుత్ ఉపకేంద్రాన్ని సర్కార్ నిర్మించింది. ఈ కేంద్రాన్ని ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ తాళ్లాయపాలెంలో ఏర్పాటు చేసింది. ఇప్పటి వరకు రాజధాని ప్రాంతానికి 220/132/33కేవీ తాడికొండ కేంద్రం నుంచి కరెంట్ సరఫరా అవుతోంది. ప్రస్తుతం నిర్మించిన 400/220 విద్యుత్ కేంద్రంతో పాటు నేలపాడులో 220/33 కేవీ విద్యుత్ కేంద్రాన్ని కూడా నిర్మించాలని సర్కార్ నిర్ణయించింది. వీటి ద్వారా రాజధాని ప్రాంతంలోని అన్ని ప్రాంతాలకు విద్యుత్ సరఫరా అవుతుంది.


# అమెరికా రాజకీయాల్లో కొత్త శక్తి..అనూహ్యంగా పైకి వచ్చిన ఎలెన్ మస్క్



వాషింగ్టన్,అమెరికా అధ్యక్ష ఎన్నికలను మస్క్ శాసించాడనటం అతిశయోక్తి కాదేమో. ఇప్పుడెక్కడ చూసినా ఇదే చర్చ సాగుతోంది. మస్క్ ప్రొఫైల్‌లో మాత్రం కొత్త ట్యాగ్ యాడ్ అవ్వడం పక్కాగా కనిపిస్తోంది. అమెరికా రాజకీయాల్లో మస్క్ మార్క్ మొదలుకానుంది. ఆయన తనకున్న ఫాలోయింగ్‌తో పాటు ఇతర పద్దతుల ద్వారా ట్రంప్ గులుపు లక్ష్యంగా పనచేశారని చెప్పవచ్చు. ఈ ఎన్నికలతో కొత్త స్టార్‌గా ఎలాన్ మస్క్ ఆవిర్భవించాడని డొనాల్డ్ ట్రంప్ స్వయంగా పేర్కొనడం విశేషం. అసలు హాఫ్ డెమోక్రట్, హాఫ్ రిపబ్లికన్‌ను అని కొన్నేళ్ల కిందట చెప్పుకొన్న మస్క్ ఇప్పుడు పూర్తిగా ట్రంప్ పక్షం వహించారు. అసలు 2016, 2020 ఎన్నికల్లో డెమోక్రట్ల పక్షానే మస్క్ నిలిచారు. కానీ, బైడెన్ కార్యవర్గంతో ఆయనకు విభేదాల కారనంగా ట్రంప్ వైపు మొగ్గు చూపారు. మస్క్ మొదటి నుంచీ ట్రంప్‌నకు వ్యతిరేకి. 2016 తర్వాత ఒకసారి 'అధ్యక్షుడిగా ఆయన సరైన వ్యక్తి కాదు' అని వ్యాఖ్యానించారు. 2022 మొదట్లో కూడా ట్రంప్ మళ్లీ ఎన్నికల్లో నిలబడకూడదని వ్యాఖ్యానించారు. అంతేకాదు.. ట్రంప్ పాలనలో నిత్యం చాలా హైడ్రామా ఉంటుందన్నారు. కానీ, మస్క్ ట్విటర్‌ను కొనుగోలు చేశాక ఇద్దరి మధ్య సంబంధాల్లో మార్పు వచ్చింది. అప్పటికే ట్రంప్‌ను సోషల్ మీడియాలు వెలివేశాయి. ఆ సమయంలో మస్క్ ఆయన్ను ఎక్స్‌లోకి తిరిగి ఆహ్వానించారు. ట్రంప్ అకౌంట్‌ను పునరుద్ధరించారు. మస్క్ సాధారణంగా తాను తటస్థంగా ఉంటానని చెబుతుంటారు. కొవిడ్ సమయంలో బైడెన్ బాధ్యతలు చేపట్టారు. ఆయన పరిపాలన తీరు, పాలసీలు కొన్ని మస్క్‌కు నచ్చలేదు. వీటిని అతడు బహిరంగంగానే తప్పు పట్టాడు. దీంతో విభేదాలకు బీజం పడింది. 2021లో శ్వేతసౌధంలో విద్యుత్తు వాహనాలపై ఓ సదస్సు జరిగింది. దీనికి అమెరికాలోని పెద్ద కంపెనీ టెస్లాను ఆహ్వానించలేదు. దేశంలో 74శాతం విద్యుత్తు వాహనాలు టెస్లావే. 2021 సెప్టెంబర్లో మస్క్ కంపెనీ స్పేస్‌ఎక్స్ పౌర అంతరిక్ష యాత్రను విజయవంతంగా చేపట్టింది. బైడెన్ తప్ప అందరూ ఆయనకు అభినందనలు తెలిపారు. తాము అనుకున్నది చేయడం సాధ్యం కావడంలేదని మస్క్ ఓ సందర్భంలో అసంతృప్తి వ్యక్తం చేశారు. 2022లో డెమోక్రటిక్ పార్టీ విభజనకారులకు నిలయమని, అది విద్వేష పూరితమైన పార్టీ అని అభివర్ణించారు. అందుకే తాను రిపబ్లికన్ల వైపు మారిపోతున్నట్లు చెప్పారు. అందుకే దేశాన్ని రక్షించేందుకు ట్రంప్‌నకు ఓటు వేయాలని పిలుపు నిచ్చారు. కమలాహారిస్ విజయం సాధిస్తే ఎక్స్‌ను మూసేయిస్తుందని ఆరోపించారు. మస్క్ మొత్తం ఆరు కంపెనీలు నిర్వహిస్తున్నారు. ఇవి ఆయా రంగాల్లో సృజనాత్మకంగా పనిచేసేవే. ముఖ్యంగా టెస్లా, స్పేస్ ఎక్స్, న్యూరాలింక్ కంపెనీలపై ప్రభుత్వ నిబంధనల ప్రభావం అధికంగా ఉంటుంది. ఈనేపథ్యంలో ట్రంప్‌తో ఉన్న సంబంధాలను వాడుకొని కంపెనీలపై ప్రభుత్వ ఏజెన్సీల నిబంధనల సడలింపులు, ఒత్తిడిని ఆయన తగ్గించుకోవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. మీడియా, టెక్నాలజీలతో పాటు ఉన్నతరంగాల ప్రముఖుల పట్ల జోబైడెన్ వ్యవహరిస్తున్న తీరుపై పలుమార్లు ఎలాన్ మస్క్ బహిరంగంగా విమర్శలు గుప్పించారు. ప్రజల్లో ట్రంప్‌పై ఉన్న వ్యతిరేకతను సైతం అనుకూలంగా మార్చేలా మస్క్ తన వ్యూహ, ప్రతివ్యూహాలతో ఆకట్టుకున్నారు. అలాగే ట్రంప్ గెలిస్తే కలిగే ప్రయోజనాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో సూపర్ సక్సెస్ అయ్యారు. అలాగే ప్రపంచకుబేరుల జాబితాలో మస్క్ ముందు వరుసలో ఉండడం, ఆకట్టుకునేలా మాట్లాడం కూడా ట్రంప్‌నకు అనుకూలంగా పనిచేశాయి.

# గుబులు పుట్టిస్తున్న హెచ్1 బి వీసాల వ్యవహారం

న్యూఢిల్లీ,దేశంలో నిరుద్యోగం తాండవిస్తున్న వేళ అంతర్జాతీయ పరిస్థితులు కూడా భారతీయులకు ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రధానంగా అమెరికా తదితర దేశాల్లో పనిచేస్తున్న వారికి ఆందోళన కలిగించేవిగా ఉన్నాయి. ట్విట్టర్,మెటా తదితర సంస్థల్లో పరిణామాలతో చాలామంది రోడ్డున పడే ప్రమాదం ఏర్పడింది. ట్విట్టర్ లో ఉద్యోగం కోల్పోయిన అమెరికాలోని మనోళ్లకు కొత్త చిక్కు వచ్చి పడింది. హెచ్ 1బీ వీసాపై అక్కడ ఉంటున్న మనోళ్లు.. రెండు నెలల్లోగా కొత్త ఉద్యోగంలో చేరాలి. లేదంటే అమెరికా వదిలి వెళ్లిపోవాల్సి ఉంటుంది. దీంతో ట్విట్టర్ తదితర సంస్థల్లో ఉద్యోగం కోల్పోయిన మనోళ్లందరూ కొత్త జాబ్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. అమెరికాలోని కంపెనీలు నాన్ ఇమిగ్రెంట్ వీసా హెచ్ 1బీ కింద ఇతర దేశాల ఎంప్లాయీస్ ను తీసుకుంటాయి. ఈ వీసా కింద ఎక్కువ శాతం మన దేశం, చైనా వాళ్లే వెళ్తుంటారు. హెచ్-1బీ వీసాతో మూడేండ్ల పాటు అమెరికాలో ఉండొచ్చు. ఈ గడువు పొడిగించుకునే అవకాశం కూడా ఉంది. మొత్తం మీద ఆరేండ్లకు మించి ఉండరాదు. అయితే చట్ట ప్రకారం.. ఉద్యోగం లేకుండా హెచ్ 1బీ వీసాపై అమెరికాలో ఉండడానికి వీల్లేదు. ఈ వీసా ఉండి ఉద్యోగం కోల్పోయిన వాళ్లు రెండు నెలల వరకు దేశంలో ఉండొచ్చు. అంతలోపు వేరే ఉద్యోగంలో చేరాలి. లేదంటే దేశం వదిలి వెళ్లాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఎక్స్‌లో ఎంతమందిని కంపెనీ తొలగించిందనేది స్పష్టత లేదు. ఒకవేళ కొత్త జాబ్ దొరకకున్నా హెచ్ 1బీ వీసాదారులు అమెరికాలో ఉండేందుకు ఒక అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. వాళ్లు బీ2 వీసాకు మారాలని సూచిస్తున్నారు. ఇది విజిటర్ వీసా. దీనిపై గరిష్టంగా 6 నెలలు అమెరికాలో ఉండొచ్చు. ఆ తర్వాత కొన్ని నెలలు పొడిగించుకునే అవకాశం కూడా ఉంది. 45 రోజుల్లోగా జాబ్ దొరక్కపోతే బీ2 వీసాకు దరఖాస్తు చేసుకోవాలి. దీంతో మాజీ ఉద్యోగులకు కొంత టైమ్ దొరుకుతుంది. అప్పుడు కొత్త జాబ్ చూసుకొని మళ్లీ హెచ్ 1బీకి మారిపోవచ్చు. అయితే బీ2 వీసాపై ఉద్యోగం చేసేందుకు అవకాశం లేదు. ఈ టైమ్‌లో బతికేందుకు అవసరమైన డబ్బులు సమకూర్చు కోవాలని యూఎస్ ఇమిగ్రేషన్ సూచిస్తోంది. కాగా, మాజీ ఉద్యోగులు కొంద రు వర్సిటీల్లో




అడ్మిషన్లకు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు ఫేస్ బుక్ మాతృసంస్థ మెటా భారీ సంఖ్యలో ఉద్యోగుల్ని తొలగించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ వారంలోనే వేలాది మంది ఉద్యోగుల్ని ఇంటికి సాగనంపేం దుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు సమాచారం. అయితే దీనిపై స్పందించేందుకు మెటా నిరాకరించింది. సెప్టెంబర్ క్వార్టర్ లో నిరాశజనక ఫలితాలు నమోదవుతాయని భావిస్తున్న మెటా వచ్చే ఏడాది నాటికి కంపెనీ స్టాక్ వాల్యూ 67బిలియన్ డాలర్ల మేర తగ్గుతుందని అంచనా వేస్తోంది. ఈ ఏడాది ఇప్పటికే మెటా అర ట్రిలియన్ డాలర్ల మేర నష్టాన్ని మూటగట్టుకుంది. దీనికి తోడు ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వృద్ధిరేటు తగ్గడం, టిక్ టాక్ నుంచి ఎదురవుతున్న పోటీ, యాపిల్ ప్రైవసీ పాలసీలో చేసిన మార్పులు, మెటావర్స్ కోసం భారీ మొత్తంలో పెట్టుబడి పెట్టాల్సి ఉండటం తదితర అంశాలు తలకు మించిన భారాన్ని మోపుతున్నట్లు మెటా చీఫ్ జూకర్ బర్గ్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక మెటావర్స్ కోసం భారీ మొత్తంలో పెడుతున్న పెట్టుబడి నుంచి పదేళ్ల తర్వాత గానీ రాబడి వచ్చే అవకాశం లేదు. కాస్ట్ కట్టింగ్‌లో భాగంగా ఉద్యోగ నియామకాలను పక్కన బెట్టడంతో పాటు ఉన్న ఉద్యోగులను సైతం సాగనంపాలని అనేక కంపెనీలు నిర్ణయించినట్లు సమాచారం. ఇలాంటి పరిస్తితి అమెరకిన్లకైనా, మనకైనా తట్టుకోవడం కష్టం. అలా కాకుండా మానవ వనరులను ఉపయోగించుకునేలా ఆయా కంపెనీలు ప్రణాళికలు సిద్ధం చేసుకోవడం ఉత్తమం.

# స్వల్పంగా తగ్గుతున్న బంగారం ధరలు



ముంబై,అక్టోబరులో ఎన్నడూ లేనంత గరిష్ఠస్థాయిలకు బంగారం, వెండి ధరలు చేరినా..కొనుగోళ్ల మద్దతు లేకపోవడంతో మెల్లగా దిగి వస్తున్నాయి. అయితే పెరిగనప్పుడు ఉన్న దూకుడు దిగి రావడంలో కనిపించచడం లేదు. దీంతో బంగారం ఇప్పటికీ కరీదైనదిగానే ఉంది. అంతర్జాతీయంగా, దేశీయంగా గిరాకీ తగ్గడంతో బంగారం, వెండి ధరలు కొంతమేర దిగి వచ్చాయి. డాలర్ విలువ ఎన్నడూ లేనంత గరిష్ఠస్థాయి అయిన రూ.84.30కు చేరింది. మనదేశం బంగారం దిగుమతులకు పూర్తిగా దిగుమతులపైనే ఆధారపడి ఉన్నందున, డాలర్ల రూపేణానే అంతర్జాతీయంగా కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఫలితంగా ఇతర దేశాల్లో బంగారం ధరలు బాగా తగ్గినా, మనదేశంలో ఆ మేర ప్రయోజనం మన కొనుగోలుదార్లకు ఉండటం లేదు. అంతర్జాతీయ విపణిలో ఔన్సు (31.10 గ్రాములు) బంగారం ధర బుధవారం ఒక్కరోజే 75 డాలర్ల మేర తగ్గి 2660 డాలర్లకు చేరింది. ఫలితంగా హైదరాబాద్ బులియన్ విపణిలో బుధవారం 10 గ్రాముల మేలిమి (999 స్వచ్ఛత) బంగారం ధర రూ.80,000 కంటే దిగి, రూ.79, 100కు పరిమితమైంది. కిలో వెండి ధర కూడా రూ.92,700కు చేరింది. పసిడి ఔన్సు గరిష్ఠంగా అక్టోబరు 30న 2801 డాలర్లకు చేరింది కూడా. ఆ పరిస్థితుల్లో దేశీయంగా 10 గ్రాముల మేలిమి బంగారం ధర రికార్డు స్థాయిలో రూ.82,000కు చేరింది. కిలో వెండి ధర రూ.1.02 లక్షలను అధిగమించింది కూడా. ఫలితంగా దేశీయంగా ఈ లోహాల అమ్మకాలు గణనీయంగా తగ్గాయని బులియన్ సంఘాలు చెబుతున్నాయి. దీపావళి ముందొచ్చే ధన త్రయోదశి సందర్భంగా కూడా బంగారం అమ్మకాలు గతేడాదితో పోల్చుకుంటే 15? తగ్గాయని అంచనా. పాత ఆభరణా లు మార్చుకుని, కొత్తవి కొనుగోలు చేసుకునే వారు పెరిగారని బులియన్ సంఘాలు వెల్లడిస్తున్నాయి. ప్రస్తుతం అంతర్జాతీయ విపణిలోనూ బంగారం, వెండిపై లాభాల స్వీకరణ జరుగుతోంది. అధిక ధరల వద్ద కేంద్రబ్యాంకులు కూడా బంగారం కొనుగోళ్లను నిలిపేశాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ తాజా సమీక్షలోనూ వడ్డీరేట్లను 0.25 శాతం తగ్గిస్తుందనే అంచనాల మధ్య, డాలర్‌కు గిరాకీ పెరిగి పుత్తడికి గిరాకీ తగ్గింది. అక్టోబరులోనే డాలర్ సూచీ 3 శాతం రాణించింది. ఫలితంగా పెట్టుబడులు అటు మళ్లుతున్న సూచనలు న్నాయి. ట్రంప్ అధ్యక్షుడిగా ఎన్నికైనందున డాలర్ మరింత బలోపేతం అవుతుందని భావిస్తున్నారు. పశ్చిమాసియా ఉద్రిక్తతలను బట్టి పసిడి ధరలు కదలాడే అవకాశం ఉందని, ఔన్సు బంగారం 2600 డాలర్ల స్థాయికి దిగిరావచ్చనే అంచనాలు ఉన్నాయి.

### ఏసీబీకి చిక్కిన మహబూబ్‌నగర్ డీఈవో

మహబూబ్‌నగర్,ఓ ఉపాధ్యాయుడి నుంచి లంచం తీసుకుంటూ మహబూబ్ నగర్ డీఈవో రవీందర్ గురువారం ఏసీబీకి పట్టుబడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. ఉపాధ్యాయుడికి దక్కాల్సిన సీనియారిటీ దక్కకపోవడంతో తనకు న్యాయం చేయాలని పలుమార్లు డీఈఓకు విజ్ఞప్తి చేశాడు. డీఈవో రూ.50,000 లంచం డిమాండ్ చేశాడు.

# మహారాష్ట్రలో హోరాహోరీ..మోడీ ప్రతిష్టకు సవాల్‌గా ఎన్నికలు

ముంబయి,నవంబర్7: దేశంలోని ఏ రాష్ట్రంలోనూ జరగని విధంగా మహారాష్ట్రలో శాసనసభ ఎన్నికల సమరం సాగబోతోంది. ఈ ఎన్నికలలో ఆరు కీలక పార్టీలు తలపడుతున్నాయి. గతంలో శివసేనను చీల్చి దానిని చికాకు పెట్టిన మోడీకి ఇప్పుడు ఈ ఎన్నికలు సవాల్ లాంటివే. శివసేనను చీల్చి ఏక్‌నాథ్ షిండేను సిఎంగా చేసినా...ఫలితం లేదు. అక్కడి ప్రజలు బిజెపి కూటమికి వ్యతిరేకంగా ఉన్నారు. మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో ఇది స్పష్టం అయ్యింది. రాష్ట్రంలో మొత్తం శాసనసభ స్థానాలు 288. ఏ ఒక్క పార్టీకీ రాష్ట్రవ్యాప్తంగా మద్దతు లేదు. ఒక్కో పార్టీకి ఒక్కో ప్రాంతంలో బలం ఉంది. ఈ ఎన్నికలలో పలు అంశాలు ప్రభావం చూపబోతున్నాయి. మరాఠాలు,ఒబిసిల మధ్య వివాదం, ఉల్లి రైతుల డిమాండ్లు, చెరకు పండించే ప్రాంతాలలో ఆందోళనలు? ఇవన్నీ ఓటర్లపై ప్రభావం చూపే అంశాలే. ఈ ప్రాంతంలో చెరకు తోటలు అధికంగా ఉన్నాయి. అవిభక్త ఎన్‌సిపి, కాంగ్రెస్ పార్టీలకు ఇక్కడ మంచి ఆదరణ ఉంది. ఈ ప్రాంతంలోని ఆరు జిల్లాలలో 70 శాసనసభ స్థానాలు ఉన్నాయి. పశ్చిమ మహారాష్ట్ర రాజకీయాలపై సహకార రంగం ప్రభావం ఎక్కువ. 1960 నుండి మహారాష్ట్రను పాలించిన 20 మంది ముఖ్యమంత్రులలో ఐదుగురు ఈ ప్రాంతం వారే. సీనియర్ నేత శరద్ పవార్‌ది కూడా పశ్చిమ మహారాష్ట్రే. 2014 వరకూ ఇక్కడ కాంగ్రెస్-ఎన్‌సిపి కూటమిదే హవా. గత శాసనసభ ఎన్నికలలో అవిభక్త ఎన్‌సిపి 27, కాంగ్రెస్ 12 స్థానాలు గెలుచుకోగా, బిజెపికి 20, శివసేనకు ఐదు స్థానాలు వచ్చాయి. ఇటీవలి లోక్‌సభ ఎన్నికలలో ఈ ప్రాంతంలోని మొత్తం 10 స్థానాలలో ఎంవిఎకు 8 సీట్లు లభించాయి. ఇప్పుడు శరద్ పవార్, ఆయన మేనల్లుడు అజిత్ పవార్ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. బిజెపి నుండి సీనియర్ నేతలను ఆకర్షించడంలో శరద్ పవార్ విజయం సాధించగలిగారు. రాబోయే శాసనసభ ఎన్నికలలో అజిత్ పవార్ నాయకత్వంలోని ఎన్‌సిపి ఏ మేరకు ప్రభావం చూపుతుందో వేచి చూడాల్సి ఉంది. పశ్చిమ ప్రాంతంలో నెలకొన్న వ్యవసాయ సంక్షోభాన్ని తనకు అనుకూలంగా మార్చుకోవాలని ప్రతిపక్ష ఎంవిఎ ప్రయత్నిస్తోంది పోటీలో కాంగ్రెస్, బిజెపి జాతీయ పార్టీలు కాగా శివసేన, శివసేన (యుబిటి), ఎన్‌సిపి, ఎన్‌సిపి (శరద్ పవార్) ప్రాంతీయ పార్టీలు. అధికారంలో ఉన్న మహాయుతిలో బిజెపి 152, ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన 78, అజిత్ పవార్ నాయకత్వంలోని ఎన్‌సిపి 52 స్థానాలలో అభ్యర్థులను నిలిపాయి. ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ (ఎంవిడి)లో కాంగ్రెస్ 102, సేన (యుబిటి) 96, ఎన్‌సిపి ఎస్‌పి) 87 స్థానాలకు పోటీ చేస్తున్నాయి. ఈ రెండు శిబిరాలూ తమ మిత్రపక్షాలైన చిన్న చిన్న పార్టీలకు కొన్ని స్థానాలను వదిలేశాయి. ప్రస్తుతానికి ఇరు పక్షాల పరిస్థితి నువ్వానేనా అన్నట్టుగా ఉందని రాజకీయ విశ్లేషకులు చెప్పారు. లోక్‌సభ ఎన్నికలలో ఎంవిడికి అధిక స్థానాలు వచ్చినప్పటికీ రెండు కూటములకు వచ్చిన ఓట్ల శాతంలో తేడా స్వల్పమేనని అభరు తెలిపారు. మజ్లిస్, ప్రహర్ జనశక్తి పార్టీ (పిజెపి), వంచిత్ బహుజన్ అఘాడీ (విబిఎ), మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్‌ఎస్) వంటి పార్టీలు ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే అవకాశాలు లేకపోలేదు. రాజ్ థాకరే నాయకత్వంలోని ఎంఎన్‌ఎస్ మహిమ్‌లో సేన (యుబిటి) ఓట్లకు, నాసిక్‌లో మహాయుతికి నష్టం చేకూర్చవచ్చునని దేశ్‌పాండే అంచనా. హిందూత్వ సంస్థల వేదికగా ఉన్న హిందూ సకాల్ సమాజ్ పలు ప్రాంతాలలో ర్యాలీలు




నిర్వహిస్తోంది. ఈ సంస్థ కూడా ఎన్నికల ఫలితాలపై కొంతమేర ప్రభావం చూపే అవకాశం ఉంది. మహారాష్ట్రలో ఆరు ప్రాంతాలు, 36 జిల్లాలు ఉన్నాయి. ఈ ప్రాంతంలోని నాలుగు జిల్లాలలో కలిపి 35 శాసనసభ స్థానాలు ఉన్నాయి. ఇక్కడ గిరిజనులు, ఓబీసీలు అధికంగా ఉంటారు. ఓబీసీల ఓట్లు సంఘటితం కావడంతో గతంలో బిజెపి లబ్ది పొందగలిగింది. ఉల్లి పండించే రైతులలో పెల్లుబుకుతున్న ఆగ్రహం మహాయుతిని దెబ్బతీసే అవకాశాలు కన్పిస్తున్నాయి. గత లోక్‌సభ ఎన్నికలలో బిజెపికి కేవలం రెండు స్థానాలు మాత్రమే వచ్చాయి. కాంగ్రెస్‌కు రెండు, ఎన్‌సిపి (పవార్), శివసేన (యుబిటి)లకు ఒక్కో స్థానం దక్కాయి. గత శాసనసభ ఎన్నికలలో బిజెపికి 13 సీట్లు లభించాయి. ఎన్‌సిపి 7, సేన 6, కాంగ్రెస్ 5 స్థానాలు గెలుచుకున్నాయి. ఉత్తర మహారాష్ట్రలో మజ్లిస్ పార్టీకి రెండు స్థానాలు వచ్చాయి. త సంవత్సరం డిసెంబరులో ఉల్లి ఎగుమతులపై విధించిన నిషేధాన్ని ఈ మేలో తొలగించారు. ఉల్లిపై ఎగుమతి సుంకాన్ని 40 శాతం నుండి 20 శాతానికి తగ్గిస్తూ కేంద్రం గత సెప్టెంబరులో నిర్ణయం తీసుకుంది. ఈ అంశాలు ఓటర్లపై ప్రభావం చూపవచ్చు. ఐదు జిల్లాలలో విస్తరించి ఉన్న కోస్తా ప్రాంతంలో 39 శాసనసభ స్థానాలు ఉన్నాయి. ఇక్కడ బాల్ థాకరే నేతృత్వంలోని అవిభక్త శివసేన ప్రభావం ఎక్కువే. థానే ప్రాంతంలో ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేకు గట్టి పట్టుంది. ఈ ప్రాంతంలో కూడా మహాయుతి ప్రభుత్వం భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులపై ఆశలు పెట్టుకుంది. గతంలో శివసేనకు కంచుకోటలుగా ఉన్న కొంకణ్, రత్నగిరి, సింధుదుర్గ్‌లో కాలూనాలని బిజెపి ప్రయత్నిస్తోంది. కొన్ని దశాబ్దాలుగా ముంబయి, దాని పరిసర జిల్లాలలో అవిభక్త శివసేనకు మంచి పట్టుంది. బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్‌పై శివసేన పాతిక సంవత్సరాల పాటు అప్రతిహతంగా ఆధిపత్యం చెలాయించింది. రాష్ట్రంలో కొత్తగా చేపట్టిన పారిశ్రామిక ప్రాజెక్టులను ప్రభుత్వం పొరుగున ఉన్న గుజరాత్‌కు కట్టబెడుతోందని ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ప్రత్యేక విదర్భ రాష్ట్ర ఏర్పాటుకు బిజెపి వ్యూహాత్మకంగా మద్దతు ఇవ్వడం ఆ పార్టీకి బాగా కలిసొచ్చింది. శివసేన వ్యతిరేకించడంతో ఆ ప్రతిపాదన ఎన్నడూ ముందుకు రాలేదు. విదర్భను పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తానంటూ బిజెపి కొత్త పల్లవి అందుకుంది. 2019 శాసనసభ ఎన్నికలలో బిజెపికి 29, శివసేనకు 7 సీట్లు వచ్చాయి. ఇటీవలి సార్వత్రిక ఎన్నికలలో విదర్భలోని 10 స్థానాలలో ఎంవిఎకు 7 సీట్లు లభించాయి. ఆర్‌ఎస్‌ఎస్ కేంద్ర కార్యాలయం ఈ ప్రాంతంలోని నాగపూర్‌లోనే ఉంది. బిజెపికి చెందిన గడ్కరీ, ఫడ్నవీస్ వంటి ప్రముఖ నేతలు ఇక్కడి వారే. సోయాబీన్, పత్తి పండించే రైతులకు పెట్టుబడి వ్యయం అధికంగా ఉండడం ఎన్నికలపై ప్రభావం చూపే అవకాశం ఉంది.


# రవీంద్రారెడ్డి రాష్ట్రాలు దాటేశాడా?



అమరావతి,వైసీపీ హార్డ్‌కోర్ సోషల్‌మీడియా కార్యకర్త వర్రా రవీంద్రారెడ్డి కోసం ఏపీ పోలీసులు వేట మొదలుపెట్టారా? వర్రా రాష్ట్రాలు దాటి వెళ్లిపోయాడా? రెండురోజుల కిందట పోలీసుల అదుపులో ఉన్న ఆయన ఎలా తప్పించుకున్నాడు? వైసీపీ పెద్దల నుంచి స్థానిక పోలీసులకు సంకేతాలు వచ్చాయా? చేసింది చేసి.. ఇప్పుడు పోలీసులు సెర్చింగ్ మొదలు పెట్టారా? ఇవే ప్రశ్నలు ఏపీ ప్రజలను వెంటాడుతున్నాయి.అధికార పార్టీ నేతలపై సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్టుల పెట్టిన వర్రా రవీంద్రారెడ్డి కోసం పోలీసులు వేట మొదలుపెట్టారు. ప్రస్తుతం కడపతోపాటు అనంతపురం జిల్లాల్లో ఆయన కోసం వెతుకులాట మొదలుపెట్టారు పోలీసులు. ప్రస్తుతం వర్రా రాష్ట్రం దాటిపోయాడనే ప్రచారం జోరుగా సాగుతోంది.రవీంద్రారెడ్డి కోసం నాలుగు పోలీస్ బృందాలు ఏర్పాటయ్యాయి. ఆయన కోసం అనంతపురం, కడప జిల్లాల్లో రెండు టీమ్‌లు సెర్చింగ్ మొదలుపెట్టారు. మరో టీమ్ బెంగుళూరు వెళ్లింది. నాలుగో టీమ్ మాత్రం వర్రా పట్టుబడిన నుంచి తప్పించుకునే జరిగిన కాల్ డేటా సేకరించే పనిలో నిమగ్నమైందని సమాచారం.ఈనెల ఐదున రాజంపేట పోలీసులు వర్రాపై కేసు నమోదు చేశారు. అదే రోజు సీఎం చంద్రబాబు ఫ్యామిలీపై నీచమైన పోస్టులు పెట్టాడు ఆ వ్యక్తి. దీనిపై కడపలో మరో కేసు నమోదు అయ్యింది. కడప ఎస్పీ ఆదేశాల మేరకు నిందితుడ్ని స్టేషన్‌కు తీసుకొచ్చారు.అదే సమయంలో రాజంపేట నుంచి మరో టీమ్ కడపకు వచ్చింది. ఈలోగా మారువేషంలో అక్కడి నుంచి తప్పించుకున్నాడు వర్రా రవీంద్రారెడ్డి. అయితే వర్రాను పోలీసులు అదుపులోకి తీసుకున్న తర్వాత కొందరు వైసీపీ మద్దతుదారులైన పోలీసులు జిల్లా నేతలకు సమాచారం ఇచ్చారట.అందులో ఓ సీఐ కీలకంగా వ్యవహరించినట్టు తెలుస్తోంది. తనకున్న పరిచయాలతో వర్రాను ఆయనే తప్పించాడంటూ పోలీసుల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. అదే సమయంలో రాజంపేట నుంచి వచ్చిన ఎస్ఐ పాత్రపై అనుమానాలు జోరందుకున్నాయి. వర్రా వ్యవహారంలో కిందిస్థాయి పోలీసులు చేసిన పనికి పైస్థాయి అధికారులు అడ్డంగా బుక్కయ్యారు. ఇదే క్రమంలో వర్రాను అరెస్ట్ చేసిన నుంచి పారిపోయే వరకు జరిగిన తతంగంపై పోలీసులు దృష్టి సారించారట. కాల్ డేటాను సేకరించే పనిలో పడ్డారట. ఇందులో ఇంకెంతమంది పోలీసులు బయటపడతారో చూడాలి. వర్రా పట్టుబడితే వైసీపీ పెద్ద తలకాయలు దొరకడం ఖాయమని అంటున్నారు.

# సమ్మర్ డిమాండ్‌ను తట్టుకునేలా చర్యలు

హైదరాబాద్,రానున్న వేసవిలో ఏర్పడే అధిక విద్యుత్ డిమాండ్‌ను తట్టుకునేలా పంపిణీ, ట్రాన్స్ మిషన్ వ్యవస్థను మెరుగుపర్చాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ అధికారులకు సూచించారు. గురువారం, మింట్ కాంపౌండ్‌లోని సంస్థ ప్రధాన కార్యాలయంలో తెలంగాణ ట్రాన్స్‌కో డైరెక్టర్ జగత్ రెడ్డి, ఇతర ఇంజినీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.గ్రేటర్ హైదరాబాద్ నగరంలో వేసవి కాలంలో విద్యుత్ డిమాండ్ రికార్డు స్థాయిలో నమోదవుతుందని అంచనా వేశారు. గతేడాది 3756 మెగావాట్లుగా ఉన్న గరిష్ట డిమాండ్ ఈ ఏడాది దాదాపు 16 శాతం వృద్ధితో 4352 మెగావాట్లుగా నమోదయ్యింది, గతేడాది 81.39 మిలియన్ యూనిట్లుగా ఉన్న వినియోగం దాదాపు 12 శాతం వృద్ధితో 90.68 మిలియన్ యూనిట్లకు చేరింది.రాబోయే 2025 వేసవిలో సైతం విద్యుత్ డిమాండ్ గతం కంటే ఎక్కువగా రికార్డు స్థాయిలో సుమారు 20 %-% 25 శాతంగా వృద్ధి నమోదు అవుతుందని అంచనా వేశారు. గ్రేటర్ హైదరాబాద్ శివారు ప్రాంతాలైన నెమలి నగర్, గోపన్ పల్లి, కోకాపేట్, కోహెడ, తట్టి అన్నారం, అబ్దుల్లాపూర్ మెట్, మాన్సాన్ పల్లి, అజీజ్‌నగర్, కందుకూరు, కే సింగారం, మల్లాపూర్, వాయుపురి, ఉప్పల్ భాగాయత్, దుండిగల్ వంటి ప్రాంతాల్లో విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరుగుతున్నది.ఆ ప్రాంతాల్లో అవసరానికి



తగ్గట్టు 220/32/3 కేవీ సబ్ స్టేషన్స్ ఏర్పాటు, ఇతర నెట్వర్క్‌లను పటిష్టం చేయడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులకు సీఎండీ దిశానిర్దేశం తెలిపారు. ప్రస్తుతం చేపడుతున్న నిర్వహణ మరమ్మతు పనులను నాణ్యత ప్రాణాలు పాటిస్తూ నిర్దేశిత సమయానికి పూర్తి చేయాలన్నారు.నిర్వహణ పనుల కోసం తీసుకుంటున్న లైన్ క్లియరెన్స్ విషయంలో చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎల్‌సీ లు తీసుకునేటప్పుడు ట్రాన్స్‌కో, డిస్కం ఇంజినీర్లు సమన్వయం చేసుకోవాలన్నారు. సంక్రాంతి లోపుగా 100 శాతం నిర్వహణ పనులు పూర్తి చేసేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com